# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 52 | విశాఖపట్నం | 22-11-2025 శనివారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 52 | VISAKHAPATNAM | 22-11-2025 SATURDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9849349934




## విజయవాడ పశ్చిమ బైపాస్‌పై రయ్..రయ్..

**ఇక హైదరాబాద్-విశాఖ మధ్య దూసుకెళ్లవచ్చు**

**విజయవాడ, పతాకం న్యూస్:** విజయవాడ పశ్చిమ బైపాస్ ప్యాకేజీ-3కి మార్గం సుగమమైంది. హైదరాబాద్-విశాఖ మధ్య రాకపోకలు సాగించే వారికి విజయవాడ ట్రాఫిక్ చెర నుంచి విముక్తి దొరికింది. ఎంచక్కా పశ్చిమ బైపాస్‌పై దూసుకెళ్లేందుకు గురువారం సాయంత్రం నుంచి దారులు తెరుచుకున్నాయి. ప్రయాణానికి ప్రతిబంధకంగా ఉన్న నున్న విద్యుత్తు టవర్ల సమస్యకు అధికారులు పరిష్కారం చూపించారు. దీంతో హైదరాబాద్ ప్రయాణికులకు బోలెడంత సమయం ఆదా కానుంది. ప్యాకేజీ-3లో చినఅవుటపల్లి-గొల్లపూడి వరకు 30 కిమీ మేర బైపాస్ పూర్తి చేశారు. జక్కంపూడి, నున్నలో రహదారిపై నుంచి వెళ్లిన హైటెన్షన్ విద్యుత్తు టవర్లతో ఇప్పటి వరకు ప్రయాణికులను అనుమతించలేదు. ఇటీవల జక్కంపూడి టవర్ల వివాదానికి కోర్టు పరిష్కారం చూపింది. ప్రస్తుతం ఉన్న ఎలైన్‌మెంట్‌లోనే విద్యుత్తు వైర్లను ఎత్తు పెంచాలని తీర్పు ఇచ్చింది. నున్న టవర్ల విషయంలో ఇప్పటికే కొత్త టవర్ల నిర్మాణం సగానికి పైగా పూర్తవడంతో జక్కంపూడి తరహా మార్పు సాధ్యం కాదని అధికారులు భావించారు. దీనికి ఎన్‌హెచ్ఏఐ అధికారులు యుద్ధప్రాతికన రహదారిపై తక్కువ ఎత్తులో ఉన్న వైర్లను పైకిలేపి నున్నలో ఓ తాత్కాలిక టవర్ నిర్మించి సమస్యను పరిష్కరించారు. చినఅవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు ఉన్న పశ్చిమ బైపాస్ రహదారి ప్యాకేజీ-3లో జక్కంపూడి, అంబాపురం, నున్న పరిధిలో మొత్తం 8 విద్యుత్ టవర్లు ఉన్నాయి. ప్రస్తుతం ఇవి రోడ్డు ఉపరితలం నుంచి 9 మీటర్ల ఎత్తులో ఉన్నాయి. ఎన్‌హెచ్ఏఐ, ల్యాంకో పవర్ ప్రాజెక్ట్ సంస్థలు ఈ టవర్లను తొలగించి కొత్త అలైన్‌మెంట్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. అయితే, దీనికి వ్యతిరేకంగా జక్కంపూడి, అంబాపురంలోని 24 మంది రైతులు, నున్నలోని 8 మంది రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పాత అలైన్‌మెంట్‌నే కొనసాగిస్తూ వైర్ల ఎత్తును పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, పాత మార్గం ప్రకారమే టవర్ల ఎత్తును రోడ్డుపైనుంచి కనీసం 14 మీటర్లకు పెంచాలని స్పష్టమైన తీర్పు ఇచ్చారు. రైతులు తమ ఆవేదనను ప్రధాని కార్యాలయం, కేంద్ర రహదారుల శాఖ మంత్రికి కూడా తెలియజేశారు. వారి విన్నపాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, వ్యవసాయ భూములకు నష్టం కలగకుండా ప్రాజెక్ట్‌ను కొనసాగించేలా నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు వైజాగ్-హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగించేవారు విజయవాడ మీదుగా వెళ్లాల్సి వచ్చేది.

చినఅవుటపల్లి నుంచి విజయవాడ దాటి హైదరాబాద్ ఎన్‌హెచ్ చేరాలంటే ట్రాఫిక్ యాతనతో గంటపైగా పట్టేది. ప్రస్తుతం చినఅవుటపల్లి దగ్గర బైపాస్ ఎక్కితే 30 నిమిషాల్లో అక్కడికి చేరుకోవచ్చు. చినఅవుటపల్లి దగ్గర గతంలో పండగల సమయంలో అనుమతించిన దారి ద్వారానే బైపాస్ ఎక్కొచ్చు. గొల్లపూడి దగ్గర యూటర్న్ తీసుకుని హైదరాబాద్ ఎన్‌హెచ్‌కి చేరవచ్చు. జక్కంపూడి టవర్ పనులకు మరో మూడు నెలలు పడుతుంది. అయినా అక్కడ రెండు వైపులా ఉన్న సర్వీస్ రోడ్డుల నుంచి ప్రయాణికులు వెళ్లే అవకాశం ఉంది. పశ్చిమ బైపాస్ ప్రాజెక్టు ఆలస్యానికి కారణమైన ఈ టవర్ల వివాదం పరిష్కార దిశగా సాగడానికి కూటమి ప్రభుత్వం కీలక పాత్ర పోషించింది. ప్రజాప్రతినిధులు నిత్యం కేంద్రంలో, రైతులతో సంప్రదింపులు జరిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, కలెక్టర్ లక్ష్మీశన్‌లతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ రైతులు, ఎన్‌హెచ్ఏఐ, పవర్ కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపి తగిన పరిష్కారం సూచించింది. ఎన్‌హెచ్ఏఐ కూడా సానుకూలంగా స్పందించడంతో, ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులు అన్నీ తొలగిపోయాయి. దీంతో ప్రస్తుతం పశ్చిమ బైపాస్‌పై రాకపోకలు ప్రారంభమయ్యాయి.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ముర్ము



**తిరుపతి, పతాకం న్యూస్:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం పద్మావతి అతిథి గృహం నుంచి బయలుదేరిన ఆమె, తిరుమల సంప్రదాయం ప్రకారం తొలుత శ్రీ భూ వరాహస్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం మహాద్వారం వద్దకు చేరుకున్న రాష్ట్రపతికి టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, ఇతర అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా స్వాగతం పలికారు. ధ్వజస్తంభానికి నమస్కరించుకున్న అనంతరం రాష్ట్రపతి గర్భాలయంలోకి ప్రవేశించి శ్రీవారి మూలవిరాట్టును దర్శించుకున్నారు. ఆమె వెంట రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఉన్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు రాష్ట్రపతికి వేదాశీర్వచనం అందించారు. టీటీడీ ఛైర్మన్, ఈవో కలిసి శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, 2026 టీటీడీ క్యాలెండర్, డైరీలను అందజేశారు. గురువారమే తిరుపతికి చేరుకున్న రాష్ట్రపతి, మొదట తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం తిరుమలకు చేరుకున్న ఆమెకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, టీటీడీ అధికారులు స్వాగతం పలికారు. తిరుమల పర్యటన ముగించుకుని రాష్ట్రపతి హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్ 2025ను ఆమె ప్రారంభించనున్నారు. రేపు శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరగనున్న శ్రీ సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాలలో ఆమె పాల్గొంటారు.

## గృహనిర్మాణ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష




**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో 'అందరికీ ఇళ్లు' (హౌసింగ్ ఫర్ ఆల్) హామీని నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక భారీ లక్ష్యాన్ని నిర్దేశించారు. రానున్న మూడేళ్లలో 17 లక్షలకు పైగా ఇళ్లను నిర్మించి, పేదలకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఇకపై ప్రతి 3 నెలలకోసారి లక్ష్యానికి అనుగుణంగా సామూహిక గృహప్రవేశ కార్యక్రమాలను నిర్వహించాలని స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో టిడ్కో, గృహనిర్మాణ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "ఎన్నికల్లో ఇచ్చిన 'హౌసింగ్ ఫర్ ఆల్' హామీని నెరవేర్చే ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. ఇప్పటికే 3 లక్షలకు పైగా ఇళ్లలో సామూహిక గృహప్రవేశాలు చేయించాం. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసి 2029 జనవరి నాటికి పూర్తి చేయాలి. కూటమి ప్రభుత్వం మొత్తం 20 లక్షల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మిగిలిన 17 లక్షల ఇళ్లను వచ్చే మూడేళ్లలో పూర్తి చేయాలి. దీనిలో భాగంగా వచ్చే ఉగాది నాటికి 5 లక్షల ఇళ్ల సామూహిక గృహప్రవేశాలు జరగాలి" అని దిశానిర్దేశం చేశారు. ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ దీనిని బాధ్యతగా తీసుకోవాలని, త్వరలోనే టిడ్కో, గృహనిర్మాణ శాఖల సిబ్బందితోనూ సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని సీఎం స్పష్టం చేశారు. "ప్రస్తుతం జరుగుతున్న లబ్ధిదారుల సర్వేను వేగంగా పూర్తి చేసి, అర్హుల జాబితాను గ్రామాల్లో ప్రదర్శించాలి. ప్రజలు తృప్తి చెందితేనే నాకు సంతృప్తి. లబ్ధిదారులు స్థలం కావాలని కోరితే కేటాయించండి... సొంత స్థలం ఉన్నవారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వండి. ప్రతి వివరమూ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండాలి" అని చంద్రబాబు ఆదేశించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఇస్తున్న అదనపు సాయాన్ని ఇకపై ముస్లిం మైనార్టీలకు కూడా వర్తింపజేస్తామని ప్రకటించారు. దీని ద్వారా 18 వేల మంది ముస్లిం మైనార్టీ లబ్ధిదారులకు అదనంగా రూ. 50 వేల చొప్పున సాయం అందుతుందని, దీనికి రూ. 90 కోట్లు అవసరమవుతాయని వివరించారు. గత ప్రభుత్వ కక్షసాధింపు చర్యల వల్ల 2014-19 మధ్య కాలంలో నిర్మించిన ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించిన రూ. 920 కోట్ల బిల్లులు నిలిచిపోయాయని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. "గత ప్రభుత్వం ఏ విధంగా ఈ బిల్లులను అడ్డుకుందో కేంద్రానికి వివరించి, వాటిని తిరిగి రాబట్టేందుకు సంప్రదింపులు జరపండి. గతంలో నరేగా పనులకు సంబంధించి ఆగిపోయిన బిల్లులను కూడా ఇదే తరహాలో తిరిగి వచ్చేలా చేశాం. అదే పద్ధతిలో ఈ హౌసింగ్ బిల్లులను కూడా సాధించాలి" అని అధికారులను ఆదేశించారు.



## ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం చేసిన సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి

2లో

## ఏపీలో 16 నుంచి టెన్త్ పరీక్షలు



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీలో పదో తరగతి పరీక్షల టైమ్ టేబుల్‌ను ఎస్ఎస్సీ బోర్డు విడుదల చేసింది. మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరగనున్నాయి. 16న ఫస్ట్ లాంగ్వేజ్, 18న సెకెండ్ లాంగ్వేజ్, 20న ఇంగ్లీష్, 23న గణితం, 25న భౌతిక శాస్త్రం, 28న జీవశాస్త్రం, 30న సాంఘిక శాస్త్రం, 31న ఫస్ట్ లాంగ్వేజ్ (పేపర్-2), ఏప్రిల్ 1న ఓఎస్ఎస్సీ సెకెండ్ లాంగ్వేజ్ పేపర్-2 పరీక్షలు నిర్వహించనున్నారు.


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..

అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..

పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

APTEL/25/A2082
పతాకం న్యూస్
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# ఈ పాపం ఎవరిది?

ఆడుతూ పాడుతూ, భవిష్యత్తు గురించి అందమైన కలలు కంటూ ఆనందంగా గడపాల్సిన తరుణం కౌమార, యవ్వన ప్రాయాలది. కానీ, అలాంటి దశలో బరువైన గమ్యాలు, తీవ్రమైన మానసిక ఒత్తిళ్లు, కల్పిత పోటీలు, పోలికలుబీ నీడలా వెంటాడే వివక్షలూ విద్యార్థుల ప్రాణాలను బలి తీసుకుం టున్నాయి. గడచిన పదేళ్లలో విద్యార్థుల బలవన్మరణాలు 72 శాతం పెరగటం ఆందోళనకరం. అధికారిక లెక్కల ప్రకారమే- మనదేశంలో రోజుకు 38 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడుతుండడం మన విద్యావ్యవస్థలో నెలకొన్న విషాదకర పరిస్థితికి ఆనవాలు. మనది ఎంత అనారోగ్యకర సమాజమో చెప్పటానికి నిదర్శనం. పాఠశాల స్థాయి నుంచి ఐఐటి వంటి ఉన్నత విద్యాసంస్థల వరకూ విద్యార్థులు పోటీ తాకిడికి విలవిల్లాడిపోతున్న దుస్థితి నేడు చుట్టూ ఆవరించి ఉంది. నెల్లూరు జిల్లా కృష్ణాపురం జవహర్ నవోదయ పాఠశాల విద్యార్థిని ప్రణీత (15) అవమానాలకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డట్టు వార్తలొచ్చాయి. ఈనెలలోనే విజయనగరం జిల్లాలో ఒక్కరోజే ముగ్గురు విద్యార్థులు వేర్వేరు చోట్ల బలవన్మరణాలకు పాల్పడ్డారు. 'చదువులో రాణించలేక పోతున్నాం. మీ ఆశలను నెరవేర్చలేకపోతున్నాం. క్షమించండి' అంటూ ఆఖరి మాటలు రాసి, విద్యార్థులు ప్రాణాలు తీసుకుంటున్న విషాదాలు తరచూ కార్పొరేట్ విద్యాసంస్థల్లో చోటు చేసుకుంటున్నాయి. పిల్లలను కేవలం గెలుపు గుర్రాలుగా చూసే ఈ సమాజపు సంకుచిత, స్వార్థ స్వభావం కారణంగానే ఇలాంటి అవాంఛనీయ పరిణా మాలు చోటు చేసుకుంటున్నాయి. 2014-23 మధ్య దేశవ్యాప్తంగా లక్షా 9 వేల మంది విద్యార్థులు బలవంతంగా చనిపోయారంటే- ఈ దుస్థితి ఏ దశకు ఎగబాకిందో అర్థం చేసుకోవొచ్చు. ఐఐటి, వైద్య విద్యాసంస్థల్లోనూ మితిమీరిన ఒత్తిడి, సామాజిక వివక్షా విలువైన విద్యార్థుల ప్రాణాలను హరిస్తున్నాయి. 2005 %-% 24 మధ్య మనదేశపు అత్యుత్తమ విద్యాసంస్థలుగా చెప్పుకునే ఐఐటీల్లో 115 మంది విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోలేక ఉసురు తీసుకున్నారు. ఉన్నత విద్యాసంస్థల్లో సామాజిక వివక్ష కూడా కోరలు చాచి, బుసలు కొడుతోంది. 2016లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల ఆత్మహత్య పడగ విప్పిన కుల వివక్షకు పరాకాష్ట. 2014 - 21 మధ్య ఐఐటి, ఐఎంఎంలలో 122 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడితే- అందులో 41 మంది ఒబిసి, 24 మంది ఎస్సీ, ముగ్గురు ఎస్టీ సామాజిక తరగతులకు చెందినవారు కావటం గమనార్హం. అణగారిన తరగతుల నుంచి వెళ్లే విద్యార్థులకు అక్కడి పరిస్థితులు కొత్తగా ఉండడం, తగిన తోడ్పాటు, భరోసా దక్కక పోవటం పెద్ద సమస్యగా పరిణమిస్తోంది. ఢిల్లీ ఎయిమ్స్‌లో రిజర్వేషన్ల ద్వారా ప్రవేశం పొందిన వైద్య విద్యార్థులు వివక్షకు గురవుతున్నట్టు 2007లోనే థోరట్ కమిటీ నివేదించింది. అధ్యాపకులు వారిని విస్మరించటం, సహకరించకపోవటం, నిరుత్సాహానికి గురి చేయటం వంటి ఉదంతాలు తమ దృష్టికొచ్చాయని పేర్కొంది. విశాల భావాలతో విలసిల్లాల్సిన విద్యాసంస్థల్లో చాలాచోట్ల ఇటువంటి వివక్షాపూరిత ధోరణి ఇప్పటికీ కొన సాగుతోంది. విద్యారంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పెచ్చుపెరిగిన తరువాత అవాంఛనీయమైన పోటీ తీవ్రస్థాయిలో పెరిగింది. పిల్లల భవిష్యత్తు పేరిట తల్లిదండ్రులు లక్షలు వెచ్చించటం అనివార్యమైంది. చదువు మీద వెచ్చించే ప్రతి రూపాయీ మంచి ఫలితాన్ని తీసుకురావాలనే తాపత్రయం హెచ్చింది. దీంతో, ఇంటా, బయటా పిల్లలపై ఒత్తిడి వేలాడే కత్తిగా మారింది. మానసిక, శారీరక వికాసానికి తోడ్పడే ఆటలూ పాటలూ విద్యార్జనలో భాగం కాకుండా పోయాయి. వీటన్నింటి కారణంగా%% నవ్వుతూ తుళ్లుతూ సాగాల్సిన పిల్లలు ఆశలను కోల్పోయి, ప్రాణాలను తీసుకునేంత నిరాశా నిస్పృహలకు గురవుతున్నారు. అణచి వేతతో కూడిన క్రమశిక్షణ, సామాజిక వివక్ష, నియంత్రణలు భవిష్యత్తును దయనీయంగా మార్చినప్పుడు ఆత్మహత్యలు ప్రబలుతాయన్నది ప్రఖ్యాత ఫ్రెంచి సామాజిక శాస్త్రవేత్త దుర్క్ హైమ్ నిర్ధారణ. శక్తికి, ఆసక్తికి తగిన విధంగా చదువు, ప్రతి పనికీ విలువ, జీవితం పట్ల ప్రేమ, అవాంఛనీయ పోటీ నివారణ వంటివి సమాజంలో నెలకొనాలి. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. విద్య, వైద్యం వంటి కీలకరంగాలను ప్రభుత్వమే నిర్వహించటం ద్వారా అనవసర పోటీకి చెల్లు చీటీ రాయాలి. కులం, మతం, ప్రాంతం, భాష పేరిట వివక్షను ప్రదర్శించే సంకుచిత తత్వాలకు చరమగీతం పాడాలి. ముఖ్యంగా విద్యార్థులకు చదువు జీవన నైపుణ్యాలను నేర్పాలి, గెలిస్తే ఉప్పొంగిపోయేబీ వెనకబడితే కృంగి కృశించి పోయే నిరర్థక పోటీని కాదు!

## మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి బాల వీరాంజనేయ స్వామి



**ప్రకాశం, పతాకం న్యూస్:** ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం మంత్రి డా.డోలా బాలవీరాంజనేయస్వామి టంగుటూరు మండలం తూర్పు నాయుడు పాలెం, మల్లవరప్పాడు చెరువుల్లో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రిజర్వాయర్లు, ట్యాంకులు, చెరువుల్లో 7 లక్షల చేపపిల్లలను వదలనున్నట్టు చెప్పారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురిశాయని రిజర్వాయర్లు, ట్యాంకుల్లో పూర్తి స్దాయిలో నీరు చేరిందన్నారు. చేప పిల్లల పెంపకం వల్ల మత్స్యకార సొసైటీలకు, గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరడంతో పాటు మత్స్యకారుల జీవనోపాధిని పెరుగుతుందన్నారు. సబ్సిడీతో వలలు, మోటార్ బోట్లు అందజేయడంతో పాటు మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం వేట నిషేధ భృతిని 20 వేల రూపాయలు అందిస్తోందన్నారు. వేటకు వెళ్లే మత్స్యకారులకు బీమా సౌకర్యం కూడా కల్పిస్తున్నామన్నారు. తుఫాను సమయంలో మత్స్యకారులకు భృతి, నిత్యవసర సరుకులు పంపిణీతో పాటు అన్ని విధాల రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్డిఓ శ్రీమతి లక్ష్మి ప్రసన్న, మత్స్య శాఖ జెడి శ్రీ శ్రీనివాస రావు, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాజధాని రైతుల సమస్యలను పరిష్కరిస్తాం: నారాయణ



**గుంటూరు, పతాకం న్యూస్:** సిటీస్ (సిఐటి ఐఎస్) ప్రాజెక్ట్ లో భాగంగా రాజధాని అమరావతి పరిధిలోని వెంకటపాలెం, ఉద్దండ రాయునిపాలెంలో ఈ - హెల్త్ , వెల్ నెస్ కేంద్రాలను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్దండరాయునిపాలెంలో మంత్రి మాట్లాడుతూ అమరావతిలో సిటీస్ ప్రాజెక్ట్ ద్వారా 15 అంగన్వాడీ భవనాలు, 14 ఈ - హెల్త్, వెల్ నెస్ కేంద్రాలు, 14 స్కూల్స్, ఒక మల్టీపర్పస్ శ్మశాన వాటిక నిర్మించామని చెప్పారు. వీటి ద్వారా రాజధాని గ్రామాల్లో నాణ్యమైన విద్యా, వైద్య సదుపాయాలు అందుతాయన్నారు. డిసెంబర్ నెలాఖరుకు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. రాజధాని రైతులకు ఇచ్చిన ప్లాట్ లలో మౌలిక వసతుల పనులు వేగంగా జరుగుతున్నాయని, మూడేళ్లలో రాజధాని నిర్మాణ పనులు పూర్తవుతాయని చెప్పారు. రాజధానిలో మొత్తం 69,421 మంది రైతులకు 61,433 ప్లాట్ ల రిజిస్ట్రేషన్ లు పూర్తి అయ్యాయని, ఇంకా కేవలం 2,270 మంది రైతులకు 7,988 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని మంత్రి వెల్లడించారు. ప్రతి రోజూ 30 నుంచి 40 రిజిస్ట్రేషన్ లు జరుగుతున్నాయని, గత 21 రోజుల్లో 231 మందికి 443 ప్లాట్ ల రిజిస్ట్రేషన్లను పూర్తి చేశామన్నారు. మొత్తం 30,635 మంది రైతులలో 29,644 మందికి ప్లాట్ ల కేటాయింపు పూర్తయిందని, ఇంకా 991 మంది రైతులకు మాత్రమే ప్లాట్ ల కేటాయింపు చేయాల్సి ఉందన్నారు. రాజధాని రైతులకు అన్యాయం జరగదని, రైతులకు ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తామన్నారు.

## 'గసబ పంచాయతీ' స్థానిక సమస్యలపై అల్లూరి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం



**డుంబ్రిగూడ, పతాకం న్యూస్:** మండల కేంద్రంలోని గసబ పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ పాంగి సురేష్ కుమార్ శుక్రవారం జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్‌ను కలిసి పంచాయతీలోని అత్యవసర స్థానిక సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో అంత్యవసరంగా ఇంటర్నల్ సీసీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలి. గరిడేలు గ్రామంలో అడవితల్లి బాట, రోడ్డు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలి.నాడు-నేడు పథకం కింద మంజూరైన గొందివలస, చిమిలిగూడ, జంగిడివలస, మొర్రిగూడ పాఠశాల భవనాల నిర్మాణం ఇంతవరకు ప్రారంభం కాలేదని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలి.

మొర్రిగూడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో విద్యాబోధన తీవ్రంగా దెబ్బతిందని, పాడేరు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉంటున్న మొర్రిగూడ టీచర్ సాగర విశ్వనాథంను వెంటనే పాఠశాలకు పంపించాలని

ఆయన కోరారు.కలెక్టర్ గారు వినతిపత్రాన్ని సానుకూలంగా స్వీకరించి, సాధ్యమైనంత త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ పాంగి సత్యనారాయణ, సీపీఎం నాయకులు పద్దు బాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం చేసిన చంద్రబాబు సతీమణి భువనేశ్వరి



**కుప్పం, పతాకం న్యూస్:** ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి కుప్పం పర్యటనలో సామాన్య మహిళగా మారి అందరినీ ఆశ్చర్యపరిచారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ఆమె స్వయంగా పరిశీలించారు. తన పర్యటనలో భాగంగా శాంతిపురంలోని నివాసం నుంచి తుమ్మిసి గ్రామానికి వెళ్లేందుకు ఆమె ఆర్టీసీ బస్సులో ఎక్కారు. మిగతా మహిళల మాదిరిగానే తన ఆధార్ కార్డును కండక్టర్‌కు చూపించి ఉచిత టికెట్‌ను పొందారు. ఈ పథకం ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. బస్సు ప్రయాణ సమయంలో భువనేశ్వరి తన పక్కన ఉన్న మహిళా ప్రయాణికులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ప్రభుత్వ పథకం ఎలా ఉందని, ఉచిత ప్రయాణం ద్వారా ఎంత లబ్ధి పొందుతున్నారని వారిని అడిగి తెలుసుకున్నారు. మహిళలు ప్రభుత్వ నిర్ణయం పట్ల సంతోషం వ్యక్తం చేయగా, వారి అభిప్రాయాలను ఆమె సావధానంగా విన్నారు. తన పర్యటనలో భాగంగా, నారా భువనేశ్వరి తుమ్మిసి పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేసిన 'జలహారతి' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఆమె అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కుప్పం ప్రాంత ప్రజల దశాబ్దాల కలను చంద్రబాబు నెరవేర్చారని అన్నారు. తాగు, సాగునీటి కష్టాలను తీర్చేందుకు ఎంతో శ్రమించి కృష్ణా జలాలను కుప్పానికి తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదేనని కొనియాడారు. కుప్పంలో నీటి కరవు అనే మాటే వినిపించకూడదన్నది ఆయన లక్ష్యమని, రాష్ట్రంలోని రైతులందరికీ సాగునీటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కేవలం నీటిపారుదలకే పరిమితం కాకుండా, కుప్పం పారిశ్రామిక ప్రగతికి కూడా చంద్రబాబు బాటలు వేశారని భువనేశ్వరి వివరించారు. ఈ ప్రాంతానికి సుమారు రూ. 23,000 కోట్ల పెట్టుబడులతో ఏడు పరిశ్రమలను తీసుకొచ్చారని, వీటిలో మూడు పరిశ్రమలు ప్రత్యేకంగా మహిళల అభివృద్ధి, ఉపాధి కోసమే కేటాయించారని పేర్కొన్నారు. పరిశ్రమలతో పాటు పర్యాటక రంగాన్ని కూడా అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. కుప్పం ప్రజల ఆశీస్సులు చంద్రబాబుకు ఎల్లప్పుడూ ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

## రేవంత్ రెడ్డి నన్ను అరెస్టు చేసే ధైర్యం చేయరు : కేటీఆర్



**హైదరాబాద్, పతాకం న్యూస్:** ఈ రేస్ కేసులో ఏమీ లేదని, రేవంత్ రెడ్డి తనను అరెస్టు చేసే ధైర్యం చేయరు అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో కెటిఆర్ మీడియాతో చిట్ చాట్ సందర్భంగా మాట్లాడారు. రేవంత్ రెడ్డి తనను అరెస్టు చేసే ధైర్యం చేయరు అని, ఈ రేస్ కేసులో ఏమీ లేదన్న విషయం రేవంత్ రెడ్డికి కూడా తెలుసునని అన్నారు. తాను ఏ తప్పూ చేయలేదని చెప్పారు. లై డిటెక్టర్ టెస్టుకైనా సిద్ధమేనన్నారు. కడియం శ్రీహరిని కాపాడేందుకు దానం నాగేందర్‌తో రాజీనామా చేయించే ప్రయత్నం చేస్తున్నారని, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడితే ప్రభుత్వం పరువు పోతుందని ముందుగానే ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించేందుకు సిద్ధమవుతున్నారు అని ఆరోపించారు. ముందుగా జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తాయని, ఆ తర్వాత ఉప ఎన్నికలు వస్తాయని కెటిఆర్ అన్నారు.

## దుబాయ్ ఎయిర్ షోలో కూలిన భారత జెట్ విమానం



**దుబాయ్:** దుబాయ్‌లో నిర్వహిస్తున్న ఎయిర్ షోలో ప్రమాదం సంభవించింది. భారత్‌కు చెందిన తేజస్ యుద్ధ విమానం ప్రమాదవశాత్తూ కుప్పకూలి పైలట్ మృతి చెందారు. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:10 గంటలకు ఈ ఘటన జరిగింది. ఎయిర్ షోలో విన్యాసాలు చేస్తున్న సమయంలో తేజస్ ఫ్లైట్ ఒక్కసారిగా కుప్పకూలడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో విమానాశ్రయం అంతటా దట్టమైన పొగలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో పైలట్ మృతి చెందినట్టు భారత వాయుసేన ధృవీకరించింది. ఈ ఘటనలో పైలట్ మరణించడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. సదరు పైలట్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపింది. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇస్తున్నట్టు పేర్కొంది వాయుసేన. ఘటనపై విచారణ చేపట్టనున్నట్టు స్పష్టం చేసింది.

## క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ థీమ్-5

**అడ్డతీగెల, పతాకం న్యూస్:**ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్రమంతటా ఎంపిడిఓ ఆధ్వర్యంలో ఒక పంచాయతీ లో, ఒక గ్రామం ను ఎంపిక చేసి క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ థీమ్-5 లో భాగంగా అడ్డతీగల మండలం, కొనలోవ గ్రామము నందు మండలంలో గల 22 గ్రామ పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రాలు మరియు కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ మొత్తం 122 మందిని ఎస్ డబ్ల్యూ పి సి షెడ్ వద్ద తడి చెత్త , పొడి చెత్త ను వేరు చేయడం వర్మీ తయారు చేయడం పై అవగాహన కల్పించడమైనది. తదనంతరం టీమ్ లు గా విభజించి ఒక్కో వీధికి ఇన్చార్జి గా పంచాయతీ కార్యదర్శిని నియమించి ప్రత్యేక పారిశుధ్యం డ్రైవ్ ను నిర్వహించడం జరిగింది. ఈ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం లో 3 టన్నులు చెత్తని సేకరించడమైనది.

# జోగంపేటలో పర్యావరణ పరిరక్షణ ప్రత్యేక శుభ్రత శిక్షణ కార్యక్రమం విజయవంతం



**గొలుగొండ, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం జోగంపేట గ్రామంలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణ,పచ్చదనం కాపాడుకోవడం థీమ్‌గా ప్రత్యేక పారిశుద్ధ్య శిక్షణ కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) యు.ఎస్.వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజలకు తడి చెత్త,పొడి చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం,చెట్లు నాటడం,నీటి సంరక్షణ,సేంద్రీయ వ్యవసాయం, జీవవైవిధ్య పరిరక్షణ,సహజ వనరులను గౌరవించడం వంటి అంశాలపై మైక్ ప్రకటనలు, నేరుగా సంభాషణల ద్వారా విస్తృత అవగాహన కల్పించారు.సేకరించిన చెత్తను చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించి దాన్ని ఉపయోగకరమైన వనరుగా మార్చే ప్రక్రియను అక్కడే ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో మండలంలోని 52 మంది క్లాప్ మిత్రాలు,పంచాయతీ కార్యదర్శులు,ఇంఛార్జి ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు ఈ కార్యక్రమానికి బ్రహ్మరథం లాగించి సహకరించారు.

## అక్రమ నిర్మాణానికి కళ్ళెం

### టీ టైం వెనుక గిరిజనేతరుడి పనుల అడ్డుకట్ట.. హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



**హుకుంపేట, పతాకం న్యూస్:** హుకుంపేట మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా సాగు తున్న అక్రమ నిర్మాణాలపై రెవె న్యూ శాఖ కొరడా ఝుళిపించింది. స్థానిక టీ టైం వెనుక భాగంలో వహీద్ అనే గిరిజనేతరుడు అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నట్లు పత్రికల్లో వరుస కథనాలు వెలువడ్డాయి. దీనిపై తహసీల్దార్ తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు వీఆర్వో, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి పనులను అధికారులు వెంటనే నిలిపివేసి, అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. గిరిజన ప్రాంత నిబంధనలను ఉల్లంఘించి గిరిజనేతరులు అక్రమ కట్టడాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

## కణితి, సంత మామిడి తోట శివాలయంలో భారీ అన్న సమారాధన



**గాజువాక, పతాకం న్యూస్:** జీవీఎంసీ 87 వార్డు పరిధిలో గల కణితి సంతమామిడి తోట శివాలయంలో ఘనంగా కార్తీక మాసం చివర రోజు పర్వదినము పోలి పాడ్యమి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివాలయంలో పాలాభిషేకం, జలాభిషేకం, ప్రత్యేక పూజలు అతి వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వార్డ్ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదం స్వీకరించారు. అనంతరం “”భారీ అన్న సమారాధన.”” ప్రారంభించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో వైసిపి వార్డు అధ్యక్షులు బొడ్డ గోవింద, ముద్దపు దామోదర్, ప్రగడ శ్రీనివాస్,చిత్రాడ వెంకటరమణ,దుగ్గపు దానప్పలు, బోండా గోవిందరాజులు, దాకా సత్తిబాబు, దాసరి అప్పుడు,ఆలయ కమిటీ సభ్యులు, మల్ల సూరిబాబు, మల్ల సతీషు, గల్లా సతీష్,బంటు వీర్రాజు,సరలాన ఈశ్వరావు, ప్రగడ ఆంజనేయులు, బండారు త్రినాథ్, సుంకర శ్రీనివాసరావు, బండారు గణేష్ ,ధనుంజయ్, అధిక సంఖ్యలో భక్తులు మహిలు ప్రజలు పాల్గొన్నారు.

## కొయ్యూరు మండలం రావణపల్లి గ్రామంలో విజువల్లి క్లీన్డ్ విల్లేజీ కార్యక్రమం



**కొయ్యూరు, పతాకం న్యూస్:** కొయ్యూరు మండలంలోని రావణపల్లి గ్రామంలో ఈరోజు విజువల్లి క్లీన్డ్ విల్లేజీ కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామాన్ని పరిశుభ్రంగా,శుభ్రతతో ఉంచేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని నాలుగు ప్రధాన వీధుల్లో పారిశుధ్య చర్యలు చేపట్టి చెత్త సేకరణ,చెత్త తొలగింపు,రోజువారీ శుభ్రతలో పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గ్రామాల్లోని క్లాప్ మిత్రులకు,అలాగే స్థానిక ప్రజలకు పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యత, చెత్తను తగిన విధంగా వర్గీకరించడం,ప్లాస్టిక్ వినియోగనం తగ్గించడం,ఇంటి నుండి తీసే వ్యర్థాలను నిర్ణీత సమయాల్లో చెత్త సేకరణ బృందాలకు అందించడం వంటి అంశాలపై సూచనలు అందించారు.కార్యక్రమంలో ఎంపీడీవో,డిప్యూటీ ఎంపీడో,మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.గ్రామీణ స్థాయిలో పరిశుభ్రతను అలవర్చుకునేలా ఈ కార్యక్రమాలు మరింత మందిలో చైతన్యం పెంచుతాయని అధికారులు తెలిపారు.

## షెరిన్ అల్లూరి ట్రైబల్ హెల్త్ కౌన్సిలింగ్ సొసైటీ సేవలు ఉపయోగించుకోండి



**అడ్డతీగల, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ అడ్డతీగల మండలం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో షేరీన్ అల్లూరి ట్రైబల్ హెల్త్ కౌన్సిలింగ్ సిబ్బంది ఎంపీడీవో కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువ శాతం ప్రజలు మలేరియా టైఫాయిడ్ బారిన పడుతున్నారు వాటి నివారణ కొరకు సెరీన్ అల్లూరి ట్రైబల్ హెల్త్ కౌన్సిలింగ్ సొసైటీ స్వచ్ఛంద సేవ సంస్థ ద్వారా ప్రజలకు టైఫాయిడ్ గురించి గ్రామాల్లో అవగాహన కలిగిస్తూ టైఫాయిడ్ గ్రామాల్లో ప్రజలకు రాకుండా టీకా వేయటం జరుగుతుందని స్థానిక ఎంపీడీవో కుమార్ స్వచ్ఛంద సంస్థ వివరించడం జరిగింది ఎంపీడీవో మాట్లాడుతూ వైద్యం పట్ల సెరీన్ హెల్త్ కౌన్సిలింగ్ వారు పూర్తి అవగాహన కలిగి ఉండాలి అన్నారు ప్రజా ప్రతినిధులు సర్పంచులు ప్రజలు వీరికి సహాయ సహకారాలు అందించాలని అన్నారు . స్థానిక ఎల్లవరం మెడికల్ ఆఫీసర్ దేవిప్రింక. టైఫాయిడ్ నివారణకు సెరీన్ అల్లూరి ట్రైబల్ హెల్త్ కౌన్సిలింగ్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంపు నిర్వహించడనీకి మా మెడికల్ నుంచి ఆశ వర్కర్లను ఏఎన్ఎం మీ సేవా సంస్థకి తోర్పడే విధంగా చర్యలు చేపడతామని అన్నారు.రంపచోడవరం డివిజన్ బోర్డు మెంబర్ సభ్యులు నరసింహా రెడ్డి, సూపర్ వైజర్ రాజోవమ్మంగి అడ్డతీగల సూపర్ వైజర్ రాజు బాబు,రాజవొమ్మంగి కోఆర్డినేటర్ శోభన్ బాబు, అడ్డతీగల మండల కోఆర్డినేటర్ ఎమ్ దుర్గాప్రసాద్, ఫీల్డ్ ఆఫీసర్స్ రామకృష్ణ, వెంకటేశ్వర్లు, సత్యవెంకట దుర్గా దేవి,రూపులమ్మ పాల్గొన్నారు.

## ఐరన్ మ్యాన్ గర్జన.. అరకులోయలో ఐక్యతా మహా యాత్ర!




**అరకులోయ, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా, అరకులోయ మండల కేంద్రంలోని భారత ఐరన్ మ్యాన్, ఏకీకృత భారత నిర్మాత, తొలి ఉప ప్రధాన మంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలు దేశమంతా ఉరకలెత్తిస్తున్న వేళ... అరకు వ్యాలీలో ఘనంగా ఐక్యతా యాత్ర జోరుగా సాగనుంది!అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి ట్రైబల్ మ్యూజియం వరకు రంగురంగుల జెండాలు రెపరెపలాడుతూ, “ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్” నినాదాలతో యువత ముందుకు దూసుకెళ్తుంది. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ మై భారత్ ఆధ్వర్యంలో జరగబోయే ఈ మహా యాత్రకు మై భారత్ విశాఖపట్నం డిప్యూటీ డైరెక్టర్ జి. మహేశ్వరరావు శ్రీకారం చుట్టారు. “565 రాజ్యాలను ఒకే త్రివర్ణ పతాకం కింద ఏకం చేసిన ధీరుడు... దేశాన్ని ఐక్యంగా నిలబెట్టిన ఇనుప మనిషి... ఆ మహానేత ఆశయాలను యువత రక్తంలో నింపాలి!” అంటూ ఉద్వేగంగా పిలుపునిచ్చారు.దేశవ్యాప్తంగా నెలరోజుల పాటు సాగుతున్న ‘రన్ ఫర్ యూనిటీ’ మహోద్యమంలో భాగంగా అరకులోయ లో ఈ ఐక్యతా యాత్రను అద్భుతంగా నిర్వహిస్తోంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, వేలాది విద్యార్థులు, గిరిజన సోదరులు %-% అందరూ ఒక్క త్రివర్ణ గొడుగు కింద ఒక్కటవుతారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అరకు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భరత్ కుమార్ నాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పి. నాగబాబు, వై. విజయలక్ష్మి, ఇందిరాగాంధీ జాతీయ ఎన్ఎస్ఎస్ అవార్డు గ్రహీత ఆర్. లీలాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ మరీడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

**కొయ్యూరు, పతాకం న్యూస్:** కొయ్యూరు మండలం,చిట్టింపాడు గ్రామంలో కొత్తగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ మరీడిమాంబ తల్లి అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరగనుందని మందిర వ్యవస్థాపకులు జుర్రా చిన రమణబాబు,ప్రదీప్ మరియు గ్రామ పెద్దలు తెలియజేసారు.అమ్మవారి దేవస్థాన ప్రతిష్ఠ మహోత్సవం 23-నవంబర్,ఆదివారం ఉదయం 9 గంటలకు వేద మంత్రాల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట జరగనుందని,అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు,మహాప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## షెరిన్ అల్లూరి ట్రైబల్ హెల్ప్ కౌన్సిలింగ్ సొసైటీ సేవలు ఉపయోగించుకోండి



**రాజవొమ్మంగి, పతాకం న్యూస్:** రాజవొమ్మంగి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో షెరిన్ అల్లూరి ట్రైబల్ హెల్త్ కౌన్సిలింగ్ సిబ్బంది ఎంపీడీవో యాదిగిరిశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువ శాతం ప్రజలు మలేరియా, టైఫాయిడ్ బారిన పడుతున్నారని, వాటి నివారణ కొరకు షెరిన్ అల్లూరి ట్రైబల్ హెల్త్ కౌన్సిలింగ్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ప్రజలకు టైఫాయిడ్ గురించి గ్రామాల్లో అవగాహన కలిగిస్తూ మలేరియా, టైఫాయిడ్ ప్రజలకు రాకుండా టీకా వేయటం జరుగుతుందని స్థానిక ఎంపీడీవో యాదగిరిశ్వరరావుకు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో యాదగిరీశ్వరరావు మాట్లాడుతూ వైద్యం పట్ల షెరిన్ హెల్త్ కౌన్సిలింగ్ వారు పూర్తి అవగాహన కలిగి ఉన్నారన్నారు. ప్రజాప్రతినిధులు, సర్పంచులు ప్రజలు వీరికి సహాయ సహకారాలు అందించాలని అన్నారు . స్థానిక రాజువమ్మంగి మెడికల్ ఆఫీసర్ సుష్మ మలేరియా, టైఫాయిడ్ నివారణకు షెరిన్ అల్లూరి ట్రైబల్ హెల్త్ కౌన్సిలింగ్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంపు నిర్వహించడానికి మా మెడికల్ నుంచి ఆశ వర్కర్లను, ఏఎన్ఎం లను మీసేవా సంస్థకి తోర్పడే విధంగా చర్యలు చేపడతామని అన్నారు. రంపచోడవరం డివిజన్ బోర్డు మెంబర్ సభ్యులు నరసింహా రెడ్డి, రాజవొమ్మంగి, అడ్డతీగల సూపర్వైజర్ రాజు బాబు, మండల కోఆర్డినేటర్ ఎస్. శోభన్ బాబు, ఫీల్డ్ఆఫీసర్, నరేంద్ర, గంగవరం, వైరామవరం మండలాల సూపర్వైజర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విద్యార్థులు చట్టాలు తెలుసుకుంటేనే భవిష్యత్తు సురక్షితం: సీఐ గోవిందరావు



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలోని శివపురం ఎస్టీ బాలురు హాస్టల్-1, 2లో విద్యార్థు లకు చట్టపరమైన అవగాహన పెంపొందించేం దుకు నర్సీపట్నం టౌన్ ఇన్స్పెక్టర్ జి. గోవిందరావు, సబ్ ఇన్స్పెక్టర్ జి. ఉమా మహేశ్వరరావు కలిసి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా అమల్లోకి వచ్చిన బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎన్ఏ చట్టాల వివరాలు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా తెలిపారు. మహిళలపై నేరాలు, పాక్సో కేసుల ప్రాముఖ్యత, బాల్య వివాహాల వల్ల కలిగే ప్రమాదాలు మరియు వాటిని నివారించే విధానాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. అదనంగా, యువతలో పెరుగుతున్న మాదక ద్రవ్యాల వినియోగం దుష్ప్రభావాలు, వాటి వల్ల వచ్చే సామాజిక-ఆరోగ్య సమస్యలపై కూడా పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఏ పరిస్థితిలోనైనా సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా పోలీసుల సహాయం ఎలా పొందాలి అన్న విషయంపై విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహనతో ముందుకు సాగి, సమాజంలో మంచి పౌరులుగా మలచుకోవాలనే సందేశాన్ని అధికారులు స్పష్టం చేశారు.

## బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ దినేష్ కుమార్



**పాడేరు, పతాకం న్యూస్ :** స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు రుణాలను సక్రమంగా, సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సూచించారు.శుక్రవారం పాడేరులోని డుంబ్రిగుడ మండలంలోని 38 స్వయం సహాయక సంఘాలకు చెందిన లబ్ధిదారులకు బ్యాంకు ఆమోదించిన మొత్తం రూ.2 కోట్ల 10 లక్షల 10 వేల రూపాయల రుణ చెక్కులను కలెక్టర్ స్వయంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “రుణాలను సరైన రీతిలో వినియోగించుకుని చిన్న చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టి మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి. ఇలా చేయడం వల్ల కుటుంబాలు బలోపేతమవుతాయి, సమాజంలో మహిళల స్థానం గౌరవప్రదంగా ఉంటుంది” అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళి తదితర అధికారులు పాల్గొన్నారు.

## కోతుల బెడద నుండి మా పంటలను రక్షించి,మమ్మల్ని ఆదుకోండి.

**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా, కొయ్యూరు మండలం, బట్టపనుకుల పంచాయతీకి చెందిన రైతులకు కోతుల బెడత తీవ్రంగా ఉందని పెసా ఉపాధ్యక్షులు ఆమూరి రంజిత్ కుమార్ మరియు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ గతంలో కోతులు ఉండేవి కానీ మందలు,మందలుగా కోతులు గ్రామస్తుల వ్యవసాయాలపై దాడి చేస్తున్నాయని,పంటలు చేతికి వచ్చే సమయంలో కోతులు కలిగించే నష్టం ఎక్కువగా ఉందని,మరియు ఎక్కడెక్కడినుండో పెద్ద లారీలో కోతులను తీసుకొచ్చి వదిలేసారని చుట్టు ప్రక్కల గ్రామస్తులు అనుకుంటున్నారని, ఇప్పుడు ఇదే మాకు శాపంగా మారిందని,వేసిన పంటను మూగ జీవులు నాశనం చేస్తుంటే రైతులు చేలలోనే పడిగాపులు కాస్తున్నారని అన్నారు. అప్పులు తెచ్చి వ్యవసాయంపై పెట్టుబడి పెడితే కోతుల వలన పెట్టుబడి కూడా వచ్చేటట్లులేదని, అప్పులే మిగిలేటట్లు ఉందని,ఈ కోతుల బెడద నుండి మమ్మల్ని కాపాడాలన్నారు.

## తగరంపూడిలో ఎమ్మెల్యే కొణతాల విస్తృత పర్యటన

**హాజరైన మండల శాఖ అధికారులు**

**పంచాయితీకి కోటి రూపాయలు నిధులు మంజూరు..**



**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి నియోజకవర్గం అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామం జాతీయ ఉత్తమ పంచాయతీగా ఎంపికైన సందర్భంగా కోటి రూపాయలు నిధులు మంజూరైన సందర్భంలో ఇక్కడ నాయకులు, అధికారులు సరైన మార్గంలో సద్వినియోగ పరచడంలో విఫలమైన కారణంగా స్థానిక తగరంపూడి ప్రజలు, పాలకవర్గం నాయకులు వినతి మేరకు మాజీ మంత్రి అనకాపల్లిశాసనసభ్యులు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తగరంపూడి గ్రామాన్ని సందర్శించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రైతు భరోసా కేంద్రం, పంచాయతీ ఆఫీస్, అంగన్వాడి కేంద్రాలు, హెల్త్ సబ్ సెంటర్లు, గ్రామంలో రోడ్లు, శారద నది గట్లు మొత్తం విస్తృతంగా పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పాడుబడిన బిల్డింగ్లో అంగన్వాడి పిల్లలు క్లాసులు జరగడం చూసి నూతనంగా నిర్మించిన అంగన్వాడి కేంద్రాన్ని ప్రారంభోత్సవం చేశారు. ఇక్కడి అధికారులను నాయకులతో సమీక్ష జరిపి నిధులను సద్వినియోగపరిచే విధంగా ఆదేశాలు ఇచ్చారు. గ్రామంలో వీధి దీపాలకు సోలార్ విద్యుత్తు వీధి దీపాలు ఏర్పాట్లు చేయాలని అధికారులును ఆదేశించారు. అలాగే తగరంపూడి గ్రామ ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరించి వారి సమస్యలను విని, సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సందీప్. గ్రామ సర్పంచ్ యాదగిరి అప్పారావు, మాజీ జడ్పిటిసి భరత్ బాబు, పంచాయతీరాజ్ డిఇ వేణుగోపాల్, ప్రాజెక్టర్ డిఈ శక్తి కుమారి, అనకాపల్లి తాసిల్దార్ జి. ఆనంద్, ఎంపీడీవో పి. ఆశాజ్యోతి, జనసేన నాయకులు తుంపాల్ ఎంపీటీసీ చదర నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసినాయుడు, బాబి, గంగుపా తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్య..





**జంగారెడ్డిగూడెం, పతాకం న్యూస్:** గురుకుల పాఠశాలలోని విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. జంగారెడ్డిగూడెం మండలం జన్నవారిగూడెం గ్రామానికి చెందిన పొడపాటి కావ్య ఆత్మహత్య చేసుకుని చనిపోయింది. జంగారెడ్డిగూడెం ఉప్పలమెట్ట గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కావ్య మధ్యాహ్నం భోజన సమయంలో విద్యార్థులంతా భోజనానికి వెళు తుండగా కావ్య ప్లేటు మర్చిపోయానని చెప్పి క్లాస్ రూమ్ లోకి వెళ్లి ఎంత టైం అవుతున్నా రాకపోయేసరికి ఒక విద్యార్థి వెళ్లి చూడగా క్లాస్ రూమ్ లో చున్నీతో కావ్య ఉరి వేసుకోవడం చూసి గట్టిగా కేకలు వేయడంతో టీచర్లు విద్యార్థులు అంతా వెళ్లి చూశారు. ఉరివేసుకున్న కావ్యాని వెంటనే జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారని క్లాస్ టీచర్ రాజకుమారి తెలిపారు. ఏరియా ఆసుపత్రిలో డాక్టర్లు చూసి అప్పటికే కావ్య మరణించినట్లు నిర్ధారణ చేశారు. జన్నవారిగూడెం గ్రామానికి చెందిన పొడపాటి గంగాధర్, ఉషారాణి కి ముగ్గురు కుమార్తెలున్నారు. ముగ్గురిలో కావ్య పెద్ద కుమార్తె. ఐదో తరగతి నుంచి ఉప్పలమెట్ట గురుకుల పాఠశాలలోనే కావ్య చదువుతుంది. కావ్య బాగా చదివే విద్యార్థిని అని క్లాస్ టీచర్లు చెబుతున్నారు. తల్లి ఉషారాణి డయాలసిస్ పేషెంట్. తండ్రి డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగిస్తుంటారు. కావ్య చనిపోవడంతో తల్లిదండ్రులు, ఆ గామస్తులు కన్నీరు మున్నీరవుతున్నారు. జంగారెడ్డిగూడెం పోలీసువారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలియజేశారు. విద్యార్థిని మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కావ్య చనిపోవడంతో హాస్టల్ లోని మిగతా విద్యార్థులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థి మృతికి గల కారణాలు తెలపాలని, విద్యార్థికి న్యాయం చేయాలని బంధువులు ప్రజా సంఘాలు ఆందోళన చేపట్టారు.

## రెయిన్ అలర్ట్.. అల్పపీడన ప్రభావంతో వర్షాలు



**అమరావతి, పతాకం న్యూస్:** వాతావరణంలో నెలకొన్న పరిస్థితుల ప్రభావంతో ఏపీలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారంకి దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు. ఇది పశ్చిమ - వాయువ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి దక్షిణ బంగాళాఖాతం మధ్య ప్రాంతాల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఆ తర్వాత 48 గంటల్లో పశ్చిమవాయువ్య దిశగా కదులుతూ నైరుతి బంగాళాఖాతంలో మరింత బలపడే అవకాశం ఉందని వివరించారు. అల్పపీడనం ఏర్పడే నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శనివారం ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.

## అందరికీ అందుబాటులో గ్రంథాలయ సేవలు: ఎమ్మెల్యే గణబాబు



**గోపాలపట్నం, పతాకం న్యూస్:** 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గోపాలపట్నం గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ , విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గణబాబు విచ్చేశారు. ఈ సందర్భంగా పలు విద్యాసంస్థల నుంచి విచ్చేసిన విద్యార్థులు ఉద్దేశించి గ్రంథాలయాలు ద్వారా పుస్తక పఠనం చేసి ఎంతో జ్ఞానం సంపాదించవచ్చునని ప్రస్తుతం అనేక గ్రంథాలు గ్రంథాలయాల్లో అందరికీ అందుబాటులో ఉన్నాయని, ప్రతి విద్యార్థి వారిని ఒకసారి అయినా గ్రంథాలయంనకు విచ్చేసి పుస్తక పఠనం తప్పనిసరిగా చేయాలని తద్వారా మీ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. భవిష్యత్తులో అనేక రంగాలకు విజ్ఞానం మీకు ఎంతో సహాయకారిగా ఉంటుందని అన్నారు. నేడు టెక్నాలజీ, ఇంటర్నెట్ , కంప్యూటర్స్ ఎన్ని వచ్చినప్పటికీ గ్రంథాలయల ఆవశ్యకత నేటి యువతకు ఎంతో అవసరమన్నారు. అందరికీ అందుబాటులో గ్రంథాలయ సేవలు అందిస్తున్న లైబ్రేరియన్ నరసింహం ను అభినందించారు. అనంతరం గత వారం రోజులుగా అనేక పాఠశాలలో విద్యార్థులకు పలు పోటీల విజేతలకు గణబాబు చేతుల మీదగా బహుమతులు మెరిట్ సర్టిఫికెట్స్ అందించారు. ప్రముఖ రచయిత దామరాజు విశాలాక్షి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. గ్రంథాలయాధికారి ఎన్. వి నరసింహం ఆధ్వర్యంలో చేశారు ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నందవరపు సోములు,గోరకల రామదాసు, మిద్దె అప్పారావు, గోపాలపట్నం కళా సేవాపీఠం గౌరవ అధ్యక్షులు చందు సుబ్బారావు, ఉపాధ్యక్షులు బండారు శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు, మేఘాద్రి గడ్డ గురుకుల కళాశాల లైబ్రేరియన్ కె. మాధవిలత , గోపాలపట్నం హై స్కూల్ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కొణతాల కృషితో ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి బ్లడ్ బ్యాంకుకు రూ.1 కోటితో నూతన పరికరాలు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో ఉన్న బ్లడ్ బ్యాంకుకు రూ. 1కోటి ప్రభుత్వ నిధులతో నూతన పరికరాలు సమకూరాయి. ఈ విషయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు వైద్యాలయంలో జరిగిన ఓ సమావేశంలో వెల్లడించారు. ఇప్పటివరకు రోగికి అత్యవసర సమయంలో వైద్యం అందించేందుకు ప్లాస్మా, ప్లేట్ లెట్స్ అవసరమైన వారికోసం విశాఖ కేజీహెచ్ కు సిఫార్సు చేయడం జరిగేదని, ఎన్టీఆర్ వైద్యాలయంలో రక్తం నుంచి ప్లాస్మా, ప్లేట్లెట్స్, ప్యాకెట్ రెడ్ బ్లడ్ సెల్స్ (పిఆర్ బీసీ), క్రియో సెల్స్ ను వేరు చేసే పరికరాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఇకపై ఈ సేవలు ప్రజలకు చేరువ కానున్నాయి. కరోనా లాంటి విపత్కర సమయంలో రోగిని కోలుకునేలా చేయడంలో ప్లాస్మా థెరపీ ప్రపంచ దేశాల్లోనే విజయవంతంగా పనిచేసింది. ఎన్నో ప్రాణాలను నిలబెట్టిందని. ప్రస్తుతం అత్యవసర సమయాల్లో మధుమేహం, గుండె జబ్బుల వంటి ప్రాణాంతక వ్యాధుల విషయంలో ప్రాణం మీదకు వస్తే ప్లాస్మా థెరపీ ఓ ఆశగా కనిపిస్తోంది. అలాంటి ప్లాస్మాను రక్తదాతల రక్తం సేకరణ ద్వారా వేరు చేసే పరికరాలు ఎన్టీఆర్ వైద్యాలయానికి సమకూరాయన్నారు. అలాగే ప్లేట్లెట్స్ పడిపోతే ప్రాణాలకే ప్రమాదం. శరీరంలో ప్లేట్లెట్స్ తక్కువైతే జీవితం ప్రమాదంలో పడుతుందని ఇది చిన్న సమస్య కాదని చిన్న గాయం నుంచి తీవ్రమైన రక్తస్రావం దాకా ఇది తీసుకెళ్తుందని ప్రస్తుతం మన ఆసుపత్రిలో అత్యవసర సమయంలో ప్లేట్ లెట్స్ అవసరమైన వారికి ప్లేట్లెట్ సమకూర్చడం కష్టంగా మారుతుంది. విశాఖ కేజీహెచ్ కు పంపాల్సిన పరిస్థితి తలెత్తుతోందని జిల్లా కలెక్టర్, ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ విజయ్ కృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రత్యేక చొరవతో ఇకపై అలాంటి పరిస్థితి రాకుండా ఉండేందుకు రక్తం నుంచి ప్లేట్లెట్స్ వేరు చేసే పరికరాలు మనకు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఇది రోగులకు ఓ రకమైన శుభవార్త. అలాగే క్రియో సెల్స్ ను కూడా వేరు చేసే పరికరాలు వస్తున్నాయని అనకాపల్లి జిల్లాలో మొట్టమొదటిసారిగా కోటి రూపాయల వ్యయంతో ఈ పరికరాలు ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రికి మంజూరు కావడం విశేషమని ఇదిలా ఉండగా రక్తదానం వల్ల చాలామందిని కాపాడటమే కాదు రక్తదానం చేసిన వారికి ఆరోగ్యం అంటున్నారు. వైద్యులు. రక్తదానంలో రక్తాన్ని నిల్వజేయడం సెల్స్ గా మార్చడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటున్నాయని ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ఆళ్ల రామచంద్రరావు స్పష్టం చేశారు. రక్తహీనత కలిగిన వారికి, దీర్ఘకాలిక ప్రాణాంతక వ్యాధులతో బాధపడే వారికి ప్లాస్మా, ప్లేట్ లెట్స్, పిఆర్బిసి, క్రియోసెల్స్ ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. రక్తం నుంచి వీటిని వేరు చేసే ఈ నూతన పరికరాలు ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రికి రావడం శుభ పరిణామం అన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ విజయ కృష్ణన్, స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు ఆళ్ల రామచంద్రరావు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వైద్యాలయంలోని బ్లడ్ బ్యాంకుకు వీరు మహర్దశ తీసుకొచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డి సి హెచ్ ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, డిఎంఅండ్ హెచ్ ఓ హైమావతి, బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జ్ డాక్టర్ రమేష్, టెక్నీషియన్స్ లోకేష్, రమేష్, రాజు, గీత, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు తాడి శాంతి కుమారి రామకృష్ణ, డాక్టర్ డిడి నాయుడు, గొర్లి శేఖర్, ఉల్లింగల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి అభివృద్దే ధ్యేయంగా అధికారులు పనిచేయాలి: ఎమ్మెల్యే కొణతాల



**అనకాపల్లి, పతాకం న్యూస్:** అభివృద్దే ధ్యేయం గా అధికారులు చిత్తశుద్ధి తో పనిచేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశించారు. శుక్రవారం అనకాపల్లి మండలంలోని అన్ని శాఖల మండల అధికారులు తో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక గుండాల జంక్షన్ లో గల జీవీఎంసీ ఎస్ఆర్ శంకరన్ మీటింగ్ హాల్ లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం లో మాజీ మంత్రి, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు సంబంధించిన అధికారులతో సమీక్ష చేసి అనకాపల్లి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన విషయాలపై చర్చించి అధికారులకు తగు సూచనలు చేశారు. అనకాపల్లి నియోజకవర్గం మండల అభివృద్దే ధ్యేయం గా అధికారులు చిత్తశుద్ధి తో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ షేక్ అయేషా, ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ, డిఈ, జీవీఎంసీ జోనల్ కమీషనర్ చక్రవర్తి, ఎలక్ట్రికల్ ఏఈ, వాటర్ వర్క్స్ ఏఈ, పబ్లిక్ వర్క్స్ ఏఈ, ఇంచార్జ్ అధికారులు, హౌసింగ్ బోర్డ్, అధికారులు పాల్గొన్నారు.

## కృష్ణా జలాలపై రాష్ట్ర ప్రయోజనాలను కాపాడండి: చంద్రబాబుకు జగన్ లేఖ



**తాడేపల్లి, పతాకం న్యూస్:** కృష్ణా నదీ జలాల వివాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వైసీపీ అధినేత జగన్ లేఖ రాశారు. కృష్ణా జలాల వివాదాల ట్రైబ్యునల్-2 (కేడబ్ల్యూడీటీ-2 ముందు త్వరలో జరగనున్న విచారణలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని ఆయన తన లేఖలో విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం కృష్ణా నదిలో 763 టీఎంసీల నీటిని తమ రాష్ట్రానికి కేటాయించాలని డిమాండ్ చేస్తున్న విషయాన్ని జగన్ ప్రస్తావించారు. ట్రైబ్యునల్ ఈ డిమాండ్‌కు అంగీకరిస్తే ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తన తుది వాదనలను బలంగా వినిపించి, ఏపీకి జరగబోయే నష్టాన్ని నివారించాలని సూచించారు. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను కాపాడటంలో చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని జగన్ ఆరోపించారు. "ప్రభుత్వం ట్రైబ్యునల్ ముందు బలహీనమైన వాదనలు వినిపిస్తోంది. రాయలసీమ ప్రాజెక్టుల విషయంలోనూ ప్రభుత్వ వైఖరి నిర్లక్ష్యంగా ఉంది" అని లేఖలో పేర్కొన్నారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తును 519.16 మీటర్ల నుంచి 524.256 మీటర్లకు పెంచేందుకు అవసరమైన భూసేకరణకు కర్ణాటక ప్రభుత్వం అనుమతులు ఇవ్వడాన్ని కూడా జగన్ ప్రస్తావించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వ వైఖరి సరిగా లేకపోవడం వల్లే పొరుగు రాష్ట్రాలు ఏపీకి నష్టం కలిగించే చర్యలు తీసుకుంటున్నాయని విమర్శించారు. 1996లో చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచే పనులు మొదలయ్యాయని, అప్పుడు రైతులు, ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేసినా ఆయన పట్టించుకోలేదని జగన్ ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఆల్మట్టి ఎత్తు పెంపునకు బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ అనుమతి ఇచ్చిందని, 2014లో కూడా టీడీపీ ప్రభుత్వం కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను తెలంగాణకు వదులుకుందని ఆరోపించారు. "ఈ కీలక తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరించి, కృష్ణా జలాలపై మన హక్కులను కాపాడాలి. బచావత్ ట్రైబ్యునల్ కేటాయించిన 512 టీఎంసీల నికర జలాల్లో ఒక్క టీఎంసీ తగ్గినా, అందుకు టీడీపీ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది" అని జగన్ తన లేఖలో స్పష్టం చేశారు.

## ఇండోర్ స్టేడియాన్ని క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలి



**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి పట్టణంలోని స్థానిక జగన్నాథ దియేటర్ వద్ద గల రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం ను క్రీడాకారులకు అందుబాటు లోకి తీసుకురావాలని మాజీ రాష్ట్ర గవర కార్పోరేషన్ డైరెక్టర్ బొడ్డేడశివ, 80వ వ వార్డ్ ఇంచార్జ్ కె. ఎం నాయుడు లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాం లో సుమారు గా రూ.1.90 లక్షల తో రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం నిర్మించడం జరిగిందని ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం గా వదిలేయడం తో 2019 లో వైస్సార్సీపీ ప్రభుత్వం లో మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ కృషి తో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కోటి నిధులు విడుదల చేసి మళ్ళీ స్టేడియం కి కొత్త కళ తీసుకువచ్చారన్నారు. వైస్సార్సీపీ ప్రభుత్వం దిగిపోయిన తర్వాత క్రీడాకారులకు అందుబాటు లోనికి తేవడం లో కూటమి ప్రభుత్వం ఘోరం గా విఫలమైందని అనకాపల్లి నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయ కర్త మలసాల భరత్ ఆదేశాల మేరకు స్టేడియం ప్రాంతానికి వెళ్ళిన మాజీ రాష్ట్ర గవర కార్పోరేషన్ డైరెక్టర్ బొడ్డేడశివ, 80వ వ వార్డ్ ఇంచార్జ్ కె. ఎం నాయుడు వెళ్లి స్టేడియం లోపల, బయట పరిస్థితులు పరిశీలించారు. ఈ ప్రాంతంలో సిమెంట్ రోడ్డు కూడా వేయకుండా అసంపూర్తి వదిలేయడం తో తరచూ వాహనదారులు ప్రమాదలకు గురవుతూ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని జీవీఎంసీ అధికారులు రోడ్డు ను పూర్తి గా వేసి ఇండోర్ స్టేడియం ను క్రీడాకారులకు అందుబాటు లోకి తీసుకురావాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ పట్టణ కార్యదర్శి వాసుపల్లి తాతయ్యలు, సుంకర వెంకటేశ్వర రావు, మద్దాల శివ నాయుడు, చదరం పరమేష్, రాపేటి సునీల్ పాల్గొన్నారు.

## ఏఐ రంగంలో టీసీఎస్ భారీ ముందడుగు.. టీపీజీతో కలిసి రూ.18,000 కోట్ల పెట్టుబడి



**ముంబై, పతాకం న్యూస్:** దేశీయ ఐటీ సేవల దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో మరో కీలక ముందడుగు వేసింది. ఏఐ డేటా సెంటర్ వ్యాపారాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రైవేట్ ఈక్విటీ సంస్థ టీపీజీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. 'హైపర్‌వాల్ట్' పేరుతో ఏర్పాటు చేయనున్న ఈ వెంచర్‌లో రెండు సంస్థలూ కలిసి ఏకంగా రూ.18,000 కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా, టీపీజీ సంస్థ రూ.8,870 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా కొత్తగా ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్ కంపెనీలో టీపీజీకి 27.5 శాతం నుంచి 49 శాతం మధ్య వాటా లభించనుంది. ఈ భారీ పెట్టుబడులతో అత్యాధునిక ఏఐ సాంకేతికతకు అవసరమైన మౌలిక సదుపాయాలను నిర్మించనున్నారు. ఈ భాగస్వామ్యంపై టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ స్పందించారు. 'హైపర్‌వాల్ట్' డేటా సెంటర్ ద్వారా తమ కస్టమర్లకు, భాగస్వాములకు సంపూర్ణమైన ఏఐ సొల్యూషన్లను అందించగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఏఐ ఆధారిత సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను అందిపుచ్చుకోవడంలో ఈ కొత్త వెంచర్ కీలక పాత్ర పోషిస్తుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## నిర్బంధ ఇ-కెవైసితో కార్మికులకు 'ఉపాధి' గండం



**న్యూఢిల్లీ పతాకం న్యూస్:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కార్మికుల ఉపాధి ప్రమాదంలో పడింది. ఈ పథకం కింద లబ్ధి పొందుతున్న కార్మికులందరికీ ఇ-కెవైసి తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సుశిక్షితులైన సిబ్బంది లేకపోవడం, స్మార్ట్‌ఫోన్ల కొరత, గ్రామీణ, మారుమూల ప్రాంతాలలో ఇంటర్నెట్ సౌకర్యం కొరవడడం వంటి కారణాలతో ఇ-కెవైసి పూర్తికావడం లేదని ప్రైవేటు పరిశోధనా గ్రూపు లిబ్‌టెక్ ఇండియా లిమిటెడ్ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ఉపాధి పథకంలో క్రియాశీలకంగా పనిచేస్తున్న కార్మికులలో సుమారు సగం మంది, మొత్తం కార్మికులలో మూడింట రెండు వంతుల మంది నేటి వరకూ తమ ఇ-కెవైసిలను పూర్తి చేయలేదు. బిజెపి పాలిత మధ్యప్రదేశ్, హర్యానా, గుజరాత్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మధ్యప్రదేశ్‌లో మొత్తం కార్మికులలో 93.9 శాతం, క్రియాశీలక కార్మికులలో 90.5 శాతం మందికి ఇ-కెవైసిలు లేవు. గుజరాత్, హర్యానా రాష్ట్రాల్లోనూ దాదాపుగా ఇదే పరిస్థితి ఉంది. ఉపాధి కార్మికులు తాజా పరిచిన ఆధార్ వివరాలు అందజేసి ఎన్ఎంఎంఎస్ యాప్‌లో ఇ-కెవైసి సమర్పించాలంటూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అన్ని రాష్ట్రాలకూ ఇటీవల సర్క్యులర్ జారీ చేసింది. ఈ నెల 1వ తేదీ నుంచే మంత్రిత్వ శాఖ దీని అమలును మొదలు పెట్టింది. ఉపాధి పథకం కింద దేశంలో 26 కోట్ల మంది కార్మికులు పేర్లు నమోదు చేసుకున్నారు. వారిలో 11.3 కోట్ల మంది క్రియాశీలక (యాక్టివ్) కార్మికులు. ఈ నెల 12వ తేదీ నాటికి మొత్తం కార్మికులలో 68.8 శాతం మంది, క్రియాశీలక కార్మికులలో 46.9 శాతం మంది తమ ఇ-కెవైసిలను పూర్తి చేయలేదు. ఇ-కెవైసిని పూర్తి చేసే కార్మికులు తమ ఫొటోగ్రాఫ్‌లను అందించాల్సి ఉంటుంది. దీనిని రిఫరెన్స్ చిత్రంగా ఉపయోగిస్తారు. హాజరు నమోదు కోసం పని ప్రదేశంలో కార్మికుడిని ఫొటో తీసిన ప్రతి సందర్భంలోనూ దానిని రిఫరెన్స్ చిత్రంతో సరిపోలుస్తారు. రెండు ఫొటోలు మ్యాచ్ అయితేనే కార్మికుడి హాజరు నమోదవుతుంది. లేనిపక్షంలో పనికి అనుమతించరు. పని ముగిసినప్పుడు తీసే ఫొటోతో రిఫరెన్స్ చిత్రం మ్యాచ్ కాకపోతే చేసిన పనికి వేతనమూ రాదు. సాంకేతిక ఇబ్బందుల కారణంగా కార్మికులు ఇ-కెవైసి పొందలేకపోతున్నారని లిబ్‌టెక్ ఇండియాలో పనిచేస్తున్న పరిశోధకుడు రాహుల్ స్వయోరా చెప్పారు. వలసల కారణంగా సకాలంలో ఇ-కెవైసి సమర్పించలేకపోతున్న కార్మికుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉన్నదని ఆయన తెలిపారు.

## వెంకటాయపాలెంలో కార్తీక వనసమారాధన



**రామచంద్రపురం, పతాకం న్యూస్:** మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో కార్తీక మాసం చివరి రోజు సందర్భంగా కులాలకు, పార్టీలకు అతీతంగా గ్రామ సర్పంచ్ యల్లమిల్లి సతీష్ కుమారి ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంఎల్ఏ పిల్లి అప్పారావు ఆడిటోరియంలో జరిగిన కార్తీక వన సమారాధన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంఎల్సి తోట త్రిమూర్తులు, రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ హాజరయ్యారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ ప్రజల్లో ఐక్యతకు వన సమారాధనలు దోహదం చేస్తాయన్నారు. స్నేహం, అభిమానం, పెంపొందించుకునేందుకు ఇవి తోడ్పడతాయన్నారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన గ్రామ సర్పంచ్ యల్లమెల్లి సతీష్ కుమారి ని ఈ సందర్భంగా వారు అభినందించారు. కార్యక్రమంలో ఎంపిపి అంబటి భవాని, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వాసంశెట్టి శ్యామ్ గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు గ్రామ పెద్దలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి




**అమరావతి, పతాకం న్యూస్:** సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, తమకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ నిర్మాణరంగ కార్మికులు కదంతొక్కారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద ధర్నా చేశారు. 1,214 మెమో రద్దు చేయాలని, పెండింగ్ క్లెయిమ్‌లు, ఇతర సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ధర్నా అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నాలో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్.శ్రీను, కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు కాక భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్ సగిలికి వినతిపత్రం అందించారు. పార్వతీపురం కలెక్టరేట్ వద్ద ధర్నాలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.గౌరీశ్వరరావు, పి.రాము మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఒ కె.హేమలతకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మధరావు పాల్గొన్నారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు, ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు మాట్లాడారు. ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నాలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం.రమేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం వసూలు చేసిన వేల కోట్ల రూపాయల సెస్సును కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయకుండా సూపర్ సిక్స్ పథకాలకు మళ్లించాలనే కుట్రతో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును పునరుద్ధరించకుండా మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ధర్నాకు సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.రామారావు అధ్యక్షత వహించారు. అనంతరం డిఆర్ఒ బి.చినఓబులేసుకు వినతిపత్రం అందజేశారు. కర్నూలు కలెక్టరేట్ వద్ద ధర్నాలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ నరసింహులు, రాష్ట్ర కమిటీ సభ్యులు కాజా బాషా, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు మాట్లాడుతూ పెండింగ్ క్లైములను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నెల్లూరులోని జిల్లా లేబర్ కమిషనర్ (డిసిఎల్) కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి ర్యాలీగా వచ్చి ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం అక్కడ నిర్వహించిన ధర్నాలో సంఘం జిల్లా కార్యదర్శి అల్లాడి గోపాల్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాం నుంచి తమ రంగం ఎటువంటి సంక్షేమ పథకాలకూ నోచుకోలేదన్నారు. తిరుపతి కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పది లక్షలు దాటి భవన నిర్మాణం చేపట్టే భవన నిర్మాణదారుల నుండి ప్రభుత్వం సెస్ వసూలు చేస్తుందని, అలా వసూలు చేసిన దాదాపు రూ.3 వేల కోట్ల రూపాయలు సంక్షేమ నిధిగా బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో ఉండేదని తెలిపారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం చంద్రన్న బీమా పేరుతో ఈ నిధులను దారి మళ్లించిందని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం కూడా ఇదే బాటలో నవరత్నాల పథకాలకు భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు నిధులను దారి మళ్లించిందన్నారు. బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మునిరాజా, కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

# భారత్‌కు రూ.824 కోట్ల విలువైన అమెరికా ఆయుధాలు

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భారత్‌కు రక్షణ ఎగుమతులపై అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఎఫ్‌జిఎం -148 జావెలిన్ యాంటీ-ట్యాంక్ గైడెడ్ మిస్సైల్ సిస్టమ్‌తో పాటు ఎం982ఏ1 ఎక్స్‌క్యాలిబర్ ప్రెసిషన్ గైడెడ్ ఆర్టిలరీ ప్రొజెక్టైల్స్, వాటి అనుబంధ సామగ్రిని భారత్‌కు విక్రయించనుంది. దాదాపు రూ.824 కోట్ల (93 మిలియన్ డాలర్లు) విలువైన ఈ భారీ డీల్‌కు ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. దీనిపై అమెరికాకు చెందిన డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ (డిఎస్‌సిఎ) ఓ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. భారత్‌కు అందించనున్న ఆయుధ సామగ్రి జాబితాలో 100 జావెలిన్ మిస్సైళ్లు, 1 ఫ్లైటు బై రౌండ్, 25 కమాండ్ లాంచ్ యూనిట్లు, ట్రైనింగ్ ఎయిడ్‌లు, సిమ్యులేషన్ రౌండ్లు, ఆయుధ సామగ్రితో ముడిపడిన విడి భాగాలు ఉన్నాయని డీఎస్‌సీఏ తెలిపింది. రూ.417 కోట్ల విలువైన 216 యూనిట్ల 'ఎం982ఏ1 ప్రొజెక్టైల్స్'ను, రూ.405 కోట్ల విలువైన 126 యూనిట్ల జావెలిన్ మిస్సైల్ సిస్టమ్‌లను భారత్‌కు విక్రయిస్తున్నట్టు పేర్కొంది. ఈ మొత్తం సామగ్రికి అమెరికా సైన్యం వైపు నుంచి పూర్తిస్థాయి జీవితకాల మద్దతు లభిస్తుందని వెల్లడించింది. ఈ ప్రతిపాదిత లావాదేవీకి అవసరమైన సర్టిఫికేషన్‌ను అమెరికా కాంగ్రెస్‌కు డిఎస్‌సిఎ అందజేసింది. "అమెరికా-భారత్‌ల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు, ప్రధాన రక్షణరంగ భాగస్వామి అయిన భారత్ భద్రతను మెరుగుపర్చేందుకు ఈ ఆయుధ సామగ్రిని విక్రయిస్తున్నాం. ఈ విక్రయ డీల్ అమెరికా విదేశాంగ విధానం, జాతీయ భద్రతా లక్ష్యాలకు మద్దతును అందిస్తుంది. దీనివల్ల ఇండో-పసిఫిక్, దక్షిణ ఆసియా ప్రాంతాల్లో రాజకీయ సుస్థిరత, శాంతి, ఆర్థిక వికాసానికి ఊతం



లభిస్తుంది. ఆ ప్రాంతాల్లో సైనికపరమైన సమతుల్యత కూడా ఏర్పడుతుంది. ఈ ఆయుధ సామగ్రి ప్రస్తుత, భవిష్యత్ ముప్పులను అత్యంత కచ్చితత్వంతో ఎదుర్కొనేలా భారత్‌కు ఉపయోగపడుతుంది. కచ్చితత్వంతో దాడులు చేయగల సామర్థ్యం భారత్‌కు లభిస్తుంది. ఈ సామగ్రిని భారత సైన్యం సమర్థవంతంగా వినియోగించగలదు" అని డిఎస్‌సిఎ ఓ ప్రకటనలో వెల్లడించింది. అమెరికా మెప్పుకోసమే మోడీ భారీగా రక్షణ ఆయుధాలను కొంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# ఆధార్ వినియోగంపై కీలక నిర్ణయం

## రానున్న కొత్త నిబంధనలు ఇవే!




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఆధార్ కార్డు వినియోగంపై కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులకు శ్రీకారం చుడుతోంది. భవిష్యత్తులో హెూటళ్లు, రెస్టారెంట్లు, ఆఫీసులు, అపార్ట్‌మెంట్లు వంటి ప్రదేశాల్లోకి ప్రవేశించాలంటే ఆధార్ తప్పనిసరి అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకు సంబంధించి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఆఫ్‌లైన్ వెరిఫికేషన్ కోసం ఒక కొత్త యాప్‌ను తీసుకురానుంది. ఆధార్ వివరాల దుర్వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా ఈ మార్పులు చేపడుతున్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం హెూటళ్లు వంటి ప్రదేశాలకు వెళ్లినప్పుడు గుర్తింపు కోసం ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను సమర్పిస్తున్నాం. దీనివల్ల కార్డుపై ఉన్న చిరునామా, ఫోన్ నంబర్ వంటి సున్నితమైన సమాచారం దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉంది. ఈ సమస్యకు పరిష్కారంగా యూఐడీఏఐ కొత్త విధానాన్ని రూపొందిస్తోంది. దీని ప్రకారం ఆధార్ కార్డుపై పూర్తి వివరాలు లేకుండా కేవలం ఫొటో, క్యూఆర్ కోడ్ మాత్రమే ఉండేలా మార్పులు చేయనున్నారు. ఈ కొత్త ఆఫ్‌లైన్ ధ్రువీకరణ వ్యవస్థ పూర్తిగా క్యూఆర్ కోడ్ ఆధారంగా పనిచేస్తుంది. 'ప్రూఫ్ ఆఫ్ ప్రెజెన్స్' అనే సరికొత్త టెక్నాలజీని ఇందులో ఉపయోగిస్తారు. ఈ విధానంలో యూఐడీఏఐ సర్వర్లతో సంబంధం లేకుండానే యాప్ ద్వారా ముఖాన్ని స్కాన్ చేసి వ్యక్తిని గుర్తిస్తారు. ఇది ప్రస్తుతం బ్యాంకులు వినియోగిస్తున్న ఫేస్ అథెంటికేషన్‌కు భిన్నమైంది. ఈ విధానం అమల్లోకి వస్తే హెూటళ్లు, లాడ్జిలు, సినిమా హాళ్లు, ఆఫీసులు, ఆసుపత్రులు, పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల గుర్తింపు వంటి అనేక చోట్ల సురక్షితంగా వెరిఫికేషన్ చేసేందుకు వీలు కలుగుతుంది. చట్టబద్ధంగా రిజిస్టర్ అయిన ఏ సంస్థ అయినా 'ఆఫ్‌లైన్ వెరిఫికేషన్ సీకింగ్ ఎంటిటీ'గా నమోదు చేసుకుని ఈ సేవలను వినియోగించుకోవచ్చు. ఇందుకు నామమాత్రపు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఈ కొత్త యాప్ ప్రస్తుతం చివరి దశ టెస్టింగ్‌లో ఉందని, త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి నిబంధనలను విడుదల చేస్తామని యూఐడీఏఐ అధికారులు తెలిపారు.

## పాము కాటుకు యువకుడు మృతి



**ప్రకాశం పతాకం న్యూస్:** పొదిలి మండలంలోని అక్కచెరువు గ్రామానికి చెందిన యువకుడు భోగాని సురేష్ (25) పాముకాటుకు గురై మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది. సురేష్ తన బంధువుతో కలిసి సి.ఎస్.పురం మండలం భైరవకోనకు వెళ్లారు. అక్కడ పూజా కార్యక్రమాలు ముగించుకొని తిరిగి ప్రయాణంలో అదే రోజు రాత్రి కనిగిరి మండలం చల్లగిరిగల వద్ద ఉన్న శివాలయం లో బస చేసిన సమయంలో పాము కాటు గురయ్యాడు. వెంటనే గుర్తించిన స్థానికులు సురేష్ ను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించి చికిత్స ఉండగా ఉదయం సురేష్ మృతి చెందారు. కనిగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా పంచనామా అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తీసుకురానున్నారు.

# పిల్లల్లో బీపీ రావడానికి కారణాలేమిటి?

## ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

హైబీపీ (అధిక రక్తపోటు) అనగానే వయస్సు మళ్లిన వారే ఎక్కువగా గుర్తొస్తుంటారు. కానీ, పిల్లలు, యుక్తవయస్సు వారిలోనూ హైబీపీ లక్షణాలు ఉంటాయి. కొందరికి వంశ పారంపర్యంగా, మరికొందరికి ఇతరత్రా జబ్బులతో ఇది రావొచ్చంటున్నారు నిపుణులు. కారణమేదైనా పిల్లల్లో బీపీని నిర్లక్ష్యం చేయవద్దని సూచిస్తున్నారు. సకాలంలో గుర్తించి, చికిత్స చేయడం మంచిదని చెబుతున్నారు. అయితే, బీపీ ఉన్న పిల్లల్లో ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి, కారణాల గురించి తెలుసుకుందాం! పిల్లల బీపీని తరచూ పరీక్షించటం, చిన్నప్పటి నుంచే గుండె ఆరోగ్యంగా ఉండటానికి తోడ్పడే అలవాట్లను నేర్పించటమూ ముఖ్యమేనని తాజా అధ్యయనం సూచిస్తోంది. ఏడేళ్ల వయస్సులో అధిక రక్తపోటు ఉన్న పిల్లలు 50 ఏళ్ల మధ్యలో హృదయ సంబంధ వ్యాధులతో చనిపోయే ప్రమాదం ఎక్కువగా ఉండవచ్చని అధ్యయనం పేర్కొంది. ఈ అధ్యయనంలో 1959 నుంచి 1966 మధ్యలో పుట్టిన 38 వేల మందిని ఆరు దశాబ్దాలుగా పరిశీలిస్తూ వచ్చారు. వీరిలో 2016 నాటికి 2837 మంది మరణించగా, 504 మంది చనిపోవటానికి గుండెజబ్బులే కారణమని వెల్లడైంది. అప్పటితో పోలిస్తే ఇప్పుడు పిల్లల జీవనశైలి గణనీయంగా మారిన నేపథ్యంలో తాజా అధ్యయన ఫలితాలు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది చాలావరకు ఆరేళ్లు పైబడ్డవారిలోనే కనిపిస్తుందంటున్నారు నిపుణులు. అధిక బరువు, అధిక కొలెస్ట్రాల్, ఉప్పు ఎక్కువగా తినటం, శారీరక శ్రమ చేయకపోవటం, ఎక్కువసేపు కదలకుండా కూర్చోవటం, కుటుంబంలో ఎవరికైనా రక్తపోటు ఉండటం, జన్యు సమస్యలు వంటివన్నీ దీనికి



దోహదం చేస్తాయని చెబుతున్నారు.

ఇది ఆరేళ్ల లోపు పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుందంటున్నారు నిపుణులు. ఇందుకు కిడ్నీ, రక్తనాళ జబ్బులు అనేవి ఎక్కువగా దోహదం చేస్తాయని చెబుతున్నారు. మెదడు మూలం వద్ద రక్తనాళాల్లో అడ్డంకి, రక్తనాళాల గోడలు మందంగా, గట్టిగా అవటం (ఆర్టీరియో స్క్లెరోసిస్), గుండె నుంచి రక్తాన్ని తీసుకొచ్చే బృహద్ధమని, దాని శాఖల్లో వాపు ప్రక్రియ తలెత్తటం (టకయాస్ డిసీజ్), మూత్ర ఇన్‌ఫెక్షన్లు, మూత్రపిండాల్లో తిత్తులు, వడపోత ప్రక్రియకు తోడ్పడే భాగాలు దెబ్బతినటం, కిడ్నీలకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలు గట్టిపడటం (రీనల్ ఆర్టరీ స్టెనోసిస్) వంటివి హైబీపీకి దారితీస్తాయని వివరిస్తున్నారు. అంతేకాకుండా, కిడ్నీల మీదుండే అడ్రినల్ గ్రంథి వద్ద ఏర్పడే కణితులతోనూ (ఫియోక్రోమోసైటోమా) బీపీ పెరుగుతుందని తెలియజేస్తున్నారు. అలాగే, పుట్టుకతో వచ్చే గుండెజబ్బులు, ముఖ్యంగా బృహద్ధమని సంకోచించటమూ (కోఆర్‌క్టేషన్ ఆఫ్ అయోర్టా) హైబీపీకి దారితీస్తుందని వెల్లడిస్తున్నారు. ఈ సమస్యలు చిన్నప్పుడు పెద్దగా ఇబ్బంది పెట్టవని కానీ, వయసు పెరుగుతున్నకొద్దీ ఎక్కువవుతూ వస్తుందని అంటున్నారు. దీంతో వ్యాయామాలు, కష్టమైన పనులు చేసేటప్పుడు తలకు, చేతులకు రక్తపోటు బాగా పెరిగిపోతుందని చెబుతున్నారు. పిల్లల్లో హైబీపీని కచ్చితంగా నిర్ధారించడం చాలా ముఖ్యం. దీంతో అనవసరంగా మందులు ఇవ్వకుండా జాగ్రత్త పడవచ్చని నిపుణులు చెబుతున్నారు. పిల్లలకు ఒకసారి పరీక్ష చేస్తే చాలదని, కనీసం రెండు సార్లయినా పరీక్షించాలని అంటున్నారు. రెండు సార్లూ బీపీ ఎక్కువుంటేనే అధిక రక్తపోటు ఉందని అనుకోవచ్చని సూచిస్తున్నారు. ఇలా వేర్వేరు రోజుల్లో కనీసం మూడు సార్లు పరీక్ష చేసి సమస్యను నిర్ధారించాల్సి ఉంటుందని తెలియజేస్తున్నారు. అవసరమైతే ఆంబులేటరీ పరికరంతోనూ రోజంతా బీపీని పరిశీలించాల్సి ఉంటుందని వివరిస్తున్నారు. పిల్లల్లో అధిక రక్తపోటు ఉన్నా ఎలాంటి లక్షణాలు కనిపించవు. అయితే, తలనొప్పి, వాంతులు, ఛాతీ నొప్పి, గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస ఆడకపోవడం లాంటి సంకేతాలతో గుర్తించవచ్చని అధ్యయనం పేర్కొంది. ఈ క్రమంలో వీలున్నప్పుడల్లా పిల్లలకు రక్తపోటు పరీక్ష చేయించటం మంచిదంటున్నారు నిపుణులు. ఆటల పోటీలకు వెళ్లే ముందు ఒకసారి రక్తపోటును పరీక్షించటం మేలని చెబుతున్నారు. ఆసుపత్రికి ఎప్పుడు వెళ్లినా, జలుబు, దగ్గు వంటి వాటి కోసం వెళ్లినప్పుడైనా, కనీసం ఏడాదికి ఒకసారైనా బీపీ పరీక్ష చేయటం మేలని సూచిస్తున్నారు. దీర్ఘకాలంగా అధిక రక్తపోటుతో బాధపడే పిల్లలకు గుండె కండరం మందం కావొచ్చంటున్నారు నిపుణులు. ఇది గుండె వైఫల్యానికి దారితీయొచ్చని హెచ్చరిస్తున్నారు. కిడ్నీలో రక్తనాళాలు దెబ్బతిని, వడపోత ప్రక్రియ అస్తవ్యస్తమవ్వచ్చని చెబుతున్నారు. కంట్లోని రెటీనా దెబ్బతినే ప్రమాదమూ ఉందని పేర్కొంటున్నారు. మెదడుకు రక్త సరఫరా చేసే నాళాలు దెబ్బతింటే తలనొప్పి, తలతిప్పు తలెత్తచ్చని తెలియజేస్తున్నారు. అంతేకాకుండా, రక్తనాళాలు చిట్లిపోయి పక్షవాతం వంటి తీవ్ర సమస్యలూ ముంచుకురావొచ్చని వివరిస్తున్నారు. పిల్లల్లో హైబీపీ చికిత్సలో మందుల కన్నా జీవనశైలి మార్పులకే అధిక ప్రాధాన్యం ఉందంటున్నారు నిపుణులు. తాజా కూరగాయలు, పండ్లు, పీచుతో కూడిన ఇతర పదార్థాలు ఎక్కువగా తినటం, చక్కెరతో చేసే పానీయాలు, సంతృప్త కొవ్వు పదార్థాలు, అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

# ఇలా చేస్తే కళ్ల కింద నల్లటి వలయాలు పోతాయి



కళ్ల కింద నల్లటి వలయాలు జీవన విధానంతో పాటు ఆరోగ్యం గురించి కూడా తెలియజేస్తాయి. కళ్ల కింద నల్లటి వలయాలకు ఎన్నో కారణాలుంటాయి. ఓ క్రమం లేకుండా నిద్రపోవడం, వేళకు ఆహారం తీసుకోకపోవటం, అనారోగ్యకర జీవన విధానం, దీర్ఘకాలం పాటు ఉన్న అనారోగ్యం, జన్యువుల కారణాలు ఉండవచ్చు. కారణం ఏదైనా అవి ముఖాన్ని అందవిహీనం చేస్తాయి. నల్లటి వలయాలు మిమ్మల్ని నిస్తేజంగా, అలసటగా కనిపించేలా చేస్తాయి. కాబట్టి వాటిని నివారించాలని ప్రతి ఒక్కరూ భావిస్తారు. కాలేజీకి వెళ్లే యువకుల నుంచి ఉద్యోగాలు చేసే అతివలు, అబ్బాయిల వరకు అందరినీ ఇబ్బంది పెట్టే సమస్య కళ్లకింద నల్లటి వలయాలు. అయితే ఇవి వచ్చాక వీటిని తగ్గించుకోవడానికి రకరకాలుగా ప్రయత్నిస్తూ ఉంటారు. మార్కెట్‌లో లభించే క్రీములు, లోషన్ల నుంచి.. వంటింటి చిట్కాల వరకు అన్నింటినీ పాటిస్తుంటారు. అయితే కళ్ల కింద నల్లటి వలయాలు పోగొట్టుకునేందుకు చికిత్స ప్రారంభించే ముందు మీకు తెలియని కొన్ని వాస్తవాల గురించి తెలుసుకోవాలి. కంటి చుట్టూ ఉండే చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. అలసట, వృద్ధాప్య సంకేతాలను చూపించే మొదటి ప్రాంతం కంటి కింద చర్మమే. అందువల్ల కంటి చుట్టూ ఉండే చర్మం ఎలా ప్రవర్తిస్తుందో తెలుసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కంటి కింద ప్రాంతాన్ని మనం వేసుకునే బట్టలతో పోల్చి చూడాలని కొందరు వైద్య నిపుణులు చెప్తున్నారు. 'ఎందుకంటే మన కంటి చుట్టూ ఉండే చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. ఎలాంటి రాపిడి తగిలినా ఆ చర్మం కందిపోతుంది. కంటి చుట్టూ ఉండే చర్మం పత్తి లాంటిది అయితే మిగతా శరీర భాగాల్లోని చర్మం డెనిమ్ లాంటిది. మీరు కాటన్, సిల్క్, నైలాన్ దుస్తులను వేర్వేరు పద్ధతుల్లో ఉతికినట్టే.. కంటి చుట్టూ ఉండే చర్మం, మిగతా భాగాల్లోని చర్మం కూడా వేర్వేరుగా ఉంటుందని గ్రహించాలి. తద్వారా మనం చర్మ సంరక్షణ కోసం తగు జాగ్రత్తలు తీసుకోవాలి' అని డెర్మటాలజిస్టులు సూచిస్తున్నారు. కంటి చుట్టూ ఏర్పడే నల్లటి వలయాలు కొన్ని స్కిన్ అలర్జీల వల్ల ఉత్పన్నం అవుతాయని డెర్మటాలజిస్టులు చెప్తున్నారు. అందువల్ల వాటిని అలర్జీ షైనర్స్ అని అంటారని వారు పేర్కొన్నారు. డార్క్ సర్కిల్స్ అనేవి మూత్రపిండాలు లేదా అడ్రినల్ అసమతుల్యతలను సూచిస్తాయని వారు వెల్లడించారు. శరీరంపై అధిక ఒత్తిడి భారం ఉన్నప్పుడు లేదా సరైన నిద్ర లేనప్పుడు ఇలాంటి స్కిన్ అలర్జీలు వస్తాయని వారు తెలిపారు. ధూమపానం, మద్యపానం లాంటి అలవాట్లు కూడా నల్లటి వలయాలకు దారితీస్తాయని చర్మ వైద్యులు వెల్లడించారు. ఆల్కహాల్ తాగడం వల్ల కళ్ల కింద రక్తనాళాలు కుచించుకుపోతాయని, తద్వారా నల్లటి వలయాలు మరింత ప్రముఖంగా కనిపిస్తాయని వారు పేర్కొన్నారు. ఆల్కహాల్ నిద్రను కూడా ప్రభావితం చేస్తుందని, నిద్ర సరిగ్గా లేకపోవడం వల్ల కళ్ల కింద నల్లటి వలయాలు ఏర్పడే సమస్య మరింత తీవ్రతరం అవుతుందని వారు తెలిపారు.

కీర దోసను ముక్కలుగా కట్ చేసి కాసేపు ఫ్రిజ్‌లో పెట్టాలి. తరువాత వాటిని పావుగంట పాటు కళ్లపై పెట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల కళ్లకు తగిన విశ్రాంతి లభిస్తుంది. నల్లటి వలయాలు నెమ్మదిగా దూరమవుతాయి. సాధారణంగా అలోవెరా అందరి ఇళ్లలో ఉంటుంది. ఇది చర్మానికి అవసరమైన మాయిశ్చర్‌ను అందిస్తుంది. దీని వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయని చాలా మంది వైద్య నిపుణులు చెబుతుంటారు. అలొవెరాను కొద్దిగా కట్ చేసి జెల్‌ను కళ్ల కింద భాగంలో రాయాలి. ఇరవై నిమిషాల తరువాత చల్లటి నీటితో కడగాలి. ఇలా చేయడం వల్ల నల్లటి వలయాలు పోయేందుకు అలోవెరా ఎంతగానో ఉపయోగపడుతుంది.

# విత్తనాల ముసాయిదా బిల్లు ఎవరి కోసం?



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దశాబ్దాల నాటి 1966 విత్తనాల చట్టం, సీడ్ కంట్రోల్ ఆర్డర్ 1983 బదులుగా '2025 విత్తనాల ముసాయిదా బిల్లు'ను కేంద్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. రానున్న పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టబోయే ముందు (డిసెంబర్ 11 లోగా) ప్రజల అభిప్రాయం కోరుతూ ఈ ముసాయిదా బిల్లును ప్రకటించింది. జన్యుమార్పిడి విత్తనాలను, కొత్త హైబ్రిడ్ విత్తనాలను కార్పొరేట్ కంపెనీల నుంచి తేలికగా దిగుమతి చేసుకోవడానికి చట్టాలను సవరిస్తున్నారు. జన్యుమార్పిడి విత్తనాలు, దిగుమతి చేసుకునే విత్తనాల సాగుకు పురుగు మందులు, ఎరువులు, నీళ్ళు ఎక్కువ అవసరం. మనం కార్పొరేట్ కంపెనీ వ్యవసాయ ఉచ్చులో చిక్కుకుంటున్నాం. ఈ బిల్లు కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్నది. చిన్న రైతులను నాశనం చేసేలా ఉంది. తరతరాలుగా జాగ్రత్తగా చేస్తున్నటువంటి వ్యవసాయాన్ని పురాతన విత్తన రకాల వెరైటీలను రక్షించుకోవడానికి ఏమాత్రం సహాయం చేసే పరిస్థితి లేదు. సాధారణ రైతులకు, ముఖ్యంగా సాంప్రదాయ విత్తనాలను తయారు చేస్తున్న రైతుల ప్రయోజనాలకు నష్టం కలుగుతుంది. ఒక కంపెనీ కేంద్ర ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందితే, అది దేశంలోని అన్ని రాష్ట్రాలలో విత్తనాలను విక్రయించడానికి అనుమతి పొందినట్లే. బహుళ రాష్ట్రాల నియంత్రణ లేనందున కార్పొరేట్ కంపెనీల వ్యాపార విస్తరణను వేగవంతం చేస్తుంది. రాష్ట్రాలపై కేంద్ర పెత్తనాన్ని సుస్థిరపరుస్తున్నారు. కంపెనీలు ప్రతి రాష్ట్రంలో వేర్వేరు అనుమతులు పొందాల్సిన అవసరం ఉండదు. నియంత్రణల సరళీకరణ పేరుతో అపరిమితమైన స్వేచ్ఛ లభిస్తుంది. కంపెనీల ఉల్లంఘనలపై నేరారోపణలను తొలగిస్తారు. లేదా శిక్షలను తగ్గిస్తారు. దీంతో కంపెనీల అధికారులు జైలుకు వెళ్లాల్సిన భయం తప్పుతుంది. మైనర్ నేరాలుగా భావించమంటున్నారు. విత్తనాల డీలర్లు, పంపిణీదారులు విత్తనాలను విక్రయించడానికి, దిగుమతి చేసుకోవడానికి, ఎగుమతి చేసుకోవడానికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. క్యూఆర్ కోడ్ ద్వారా పక్కా నియంత్రణ వుంటుంది. చిన్న వ్యాపారస్తులు పోటీలో నిలబడలేరు. పెద్ద కార్పొరేట్ కంపెనీలకు కేంద్రీకృత అనుమతి వలన వ్యాపారం సులభమవుతుంది. వ్యవసాయ మంత్రిత్వ శాఖ చాలా కాలంగా నకిలీ విత్తనాల గురించి మాట్లాడుతున్నది. కార్పొరేట్ కంపెనీలు నకిలీ విత్తనాలు అమ్మితే కఠినమైన జరిమానా విధించబడుతుందనే అభిప్రాయాన్ని కలిగించింది. అయితే ప్రస్తుత బిల్లులో ఎటువంటి కఠినమైన నిబంధనలను ప్రతిపాదించలేదు. ముసాయిదాలో నకిలీ విత్తనాలు అనే పదమే లేదు.ప్రత్యేకించి రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతి సంవత్సరం ఖరీఫ్ రబీ సీజన్లో నకిలీ, నాణ్యత లేని నాసిరకం విత్తనాల అమ్మకాల కారణంగా రైతులు భారీగా నష్టాలు చవిచూస్తున్నాయి. విత్తనాలు అమ్మిన కంపెనీలు ముందు ఒకరకంగా వాగ్దానాలు ఇస్తున్నారు. మొలక శాతానికి, దిగుబడులకు మాదే గ్యారంటీ అంటున్నారు. అమ్ముకున్న తరువాత సమస్య వచ్చినపుడు ముఖం చాటేస్తున్నారు. విత్తన సరఫరా గొలుసులో పారదర్శకత, జవాబుదారీతనం నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్తున్నా%’%సెక్షన్ 31 కింద నియమించబడిన సీడ్ ఇన్‌స్పెక్టర్‌కు విశేష అధికారాలను ఇచ్చారు. అనుమానం వచ్చిన విత్తనాల శాంపిళ్లను ఆ ప్రాంత అనలిస్ట్ దగ్గరకు పంపి, స్టాక్‌ను సీజ్ చేయాలి. సీడ్ ఇన్‌స్పెక్టర్‌కు అనుమానం వచ్చినప్పుడు ఇంటి తలుపులు పగలకొట్టైనా అనుమానం వున్న విత్తనాలను స్వాధీనం చేసుకునే అధికారాలను ఇచ్చారు. అపరిమితమైన అధికారాలను సీడ్ ఇన్‌స్పెక్టర్‌కు కట్టబెట్టారు. కొంతమంది స్వార్థ ప్రయోజనాలు కలిగిన రైతులు కంపెనీలను అనవసరంగా కోర్టుకు లాగుతున్నారంటూ కంపెనీలను రక్షించాలని ప్రభుత్వం వాదించింది. 2025 నాటికి భారత విత్తన మార్కెట్ విలువ దాదాపు 3.82 బిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనా. 2030 నాటికి దాదాపు 5.5 శాతం వార్షిక వృద్ధిరేటుతో దాదాపు 5 బిలియన్ డాలర్లు పెరుగుతుందని అంచనా. ఇంత భారీ మార్కెట్‌పై బేయర్స్, మాన్సాంటో, సింజెంటా లాంటి కార్పొరేట్ కంపెనీలు కన్ను వేశాయి. పెద్ద కంపెనీలు తప్పులు చేయరంటున్నారు. వలస పాలకులు తమ సహాయకులను రక్షించేందుకు ఉపయోగించిన 'గుడ్ ఫెయిత్' క్లాజును విత్తన చట్టంలో కూడా ప్రయోగిస్తున్నారు. మొదటి తప్పు, రెండవ తప్పులకు పెనాల్టీ లేదు. కేంద్ర ప్రభుత్వం లేక రాష్ట్ర ప్రభుత్వం అవసరాన్ని బట్టి పెనాల్టీని నిర్ణయించటానికి సెక్షన్ 34 ప్రకారం ఒక నోటిఫికేషన్ ద్వారా ఒక ఆఫీసర్‌ను నిర్ణయించవచ్చు. ప్రభుత్వం నియమించిన ఆఫీసరు పెనాల్టీని నిర్ణయిస్తాడు. ఆ ఆఫీసురు సెక్షన్ 31 ప్రకారం ప్రథమ తప్పు అని భావిస్తే కంపెనీని శిక్ష లేకుండా వదిలేయొచ్చు. లేకపోతే రూ.50 వేల పెనాల్టీని, చిన్న తప్పు కింద విధించవచ్చు. మూడు సంవత్సరాల వరకు అదే తప్పులు మరలా చేస్తూ ఉంటే రెండు లక్షల పెనాల్టీ వరకు విధించవచ్చు. పెద్ద తప్పు అని భావిస్తే పది లక్షల పెనాల్టీ జరిమానా కూడా విధించవచ్చు. మరలా ఐదు సంవత్సరాల తర్వాత కూడా అదే పని చేస్తుంటే రూ.30 లక్షలు వరకు కూడా పెనాల్టీ విధించడానికి, డీలర్‌షిప్‌ని రద్దు చేయడానికి, మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించడానికి ఈ బిల్ అవకాశమిస్తున్నది. ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే ఎక్కువ ధరలకు అమ్మడం, రిజిస్ట్రేషన్ గడువు ముగిసిన తర్వాత ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలం విత్తన వ్యాపారాన్ని కొనసాగించటం, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ప్రదర్శించకపోవడం, విత్తన ప్యాకెట్‌పైన లేబుల్ అతికించకపోవటం లాంటివన్నీ కూడా చిన్న తప్పుల కింద భావిస్తారు.

# ఉక్రెయిన్ యుద్ధానికి త్వరలోనే ముగింపు ?



**వాషింగ్టన్ :** రష్యా –ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు ఉద్దేశించిన శాంతి ప్రణాళికకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'చడీచప్పుడు లేకుండా' ఆమోదం తెలిపినట్లు సమాచారం. రష్యాఉక్రెయిన్ మధ్య శాంతి స్థాపన కోసం 28 సూత్రాల ప్రణాళికకు ట్రంప్ ఈ వారంలోనే ఆమోదం తెలిపారని ప్రభుత్వ సీనియర్ అధికారిని ఉటంకిస్తూ ఎన్‌బిసి న్యూస్ వెల్లడించింది. ప్రభుత్వానికి చెందిన ఉన్నతాధికారులు గత కొన్ని వారాలుగా ఈ ప్రణాళికను ఎవరికీ తెలియకుండా గోప్యంగా రూపొందించారని, అందులో భాగంగా రష్యా రాయబారి కిరిల్ డ్మిత్రైవ్ ఉక్రెయిన్ అధికారులతో సంప్రదింపులు జరిపారని తెలిపింది. రష్యాతో ఈ చర్చలు జరపడంలో ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్ కీలక పాత్ర పోషించారు. ఫలితంగా ఈ శాంతి ఒప్పందానికి రష్యా సుముఖత వ్యక్తం చేసింది. ఈ ప్రణాళికను తొలుత ఆక్సియోస్ అనే వార్తా వెబ్‌సైట్ బయటపెట్టింది. ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల గాజా శాంతి ప్రణాళిక నుంచి ఈ ప్రతిపాదన స్ఫూర్తి పొందిందని ఆ వెబ్‌సైట్ పేర్కొంది. కాగా శాంతి ప్రణాళికలోని ముఖ్యమైన అంశాలను తెలిపేందుకు ప్రభుత్వాధికారి నిరాకరించారని ఎన్‌బిసి న్యూస్ చెప్పింది. దీనిపై సంబంధిత పక్షాల మధ్య ఇంకా సంప్రదింపులు జరగాల్సి ఉన్నదని ఆ అధికారి గుర్తు చేశారు. శాంతి ప్రణాళికను ఇంకా ఉక్రెయిన్ నేతలకు అందజేయలేదని అమెరికా అధికారులు చెప్పారు. అమెరికా సైనిక ప్రతినిధి బృందం ఉక్రెయిన్‌లో పర్యటించాల్సి ఉన్నదని, ఆ తర్వాతే ముసాయిదా రూపకల్పన పూర్తవుతుందని వారు అన్నారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్షరష్యా యుద్ధం మొదలైంది. గత కొన్ని దశాబ్దాల కాలంలో యూరప్‌లో ఇంతటి సుదీర్ఘ, భారీ యుద్ధం జరగలేదు. ముఖ్యంగా తూర్పు, దక్షిణ ఉక్రెయిన్ ప్రాంతంలోనే ఈ యుద్ధం కేంద్రీకృతమైంది. ఈ కారణంగా పెను విధ్వంసమే జరిగింది. వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు.




# నిఖత్ జరీన్ పసిడి పంచ్



భారత మహిళా బాక్సర్, హైదరాబాద్‌కు చెందిన నిఖత్ జరీన్ వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో సత్తా చాటింది. మహిళల 51కిలోల విభాగంలో ఫైనల్లో గెలిచి స్వర్ణ పతకంతో మెరిసింది. విశ్వవేదికపై తన పంచ్ పవర్ చూపించిన నిఖత్ దేశానికి మరో బంగారు పతకం అందించింది. వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో ప్రత్యర్థి గ్జువాన్ యూ గువో(చైనీస్ తైపీ)ను మట్టికరిపించి విజేతగా నిలిచింది. పారిస్ ఒలింపిక్స్‌లో తృటిలో పతకం చేజార్చుకున్న నిఖత్.. స్వదేశంలో జరుగుతున్న వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో తడాఖా చూపించింది. రెండుసార్లు వరల్డ్ ఛాంపియన్ నిఖత్.. ప్రత్యర్థులపై పంచ్‌ల వర్షం కురిపిస్తూ ఫైనల్ చేరింది. సెమీస్‌లో ఉజ్బెకిస్థాన్ బాక్సర్ గనీవ గుల్సేవర్‌పై సంచలన విజయంతో టైటిల్ పోరుకు సిద్ధమైన నిఖత్%’% అదే ఉత్సాహంతో ఫైనల్లోనూ మెరిసింది. తనదైన దూకుడుతో చైనీస్ తైపీకి చెందిన గువో యూ గ్జువాన్‌ను చిత్తుగా ఓడించింది. మ్యాచ్ ఆసాంతం ఆధిపత్యం చెలాయించిన భారత బాక్సర్ 5–0తో విజేతగా నిలిచింది. ఈ క్రమంలో నలుగురు భారత బాక్సర్లు స్వర్ణ పతకాలతో మెరిశారు. 48 కిలోల విభాగంలో మీనాక్షి హుడా, ప్రీతి పవార్(54 కిలోలు), అరుంధతి (70 కిలోలు), నుపుర్ షోరాన్(84 కిలోలు) దేశానికి పసిడి పతకాలు సాధించారు.

# నేటి నుండి దక్షిణాఫ్రికాతో రెండో టెస్టు.. టీమిండియా గెలిచేనా?



శనివారం నుంచి టీమిండియా–సౌతాఫ్రికా మధ్య గువాహటి వేదికగా రెండో టెస్టు ప్రారంభం కానుంది. జట్టుతో పాటు ఇప్పటికే గువాహటి చేరుకున్న గిల్ ప్రాక్టీస్‌లో మాత్రం పాల్గొనలేకపోయాడు. తాజాగా ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరయ్యాడు. ఫలితం అనుకూలంగా రాకపోవడంతో గిల్‌ను జట్టు నుంచి రిలీజ్ చేశారు. దీంతో అతడు ముంబైకి పయనమయ్యాడు. అక్కడ కొన్ని రోజులు విశ్రాంతి తీసుకున్న తర్వాత మరోసారి వైద్యులను సంప్రదించనున్నాడు. అయితే అతడిని సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు పంపే విషయమై ఇప్పటివరకు బీసీసీఐ ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. మరికొన్ని రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

అనూహ్యంగా జట్టులోంచి వైదొలిగిన గిల్ స్థానంలో స్టార్ బ్యాటర్, వికెట్ కీపర్ రిషభ్ పంత్ కెప్టెన్సీ బాధ్యతలను అందుకున్నాడు. గిల్ గైర్హాజరీలో జట్టును ముందుండి నడిపించనున్నాడు. దీంతో ఓ అరుదైన రికార్డును సొంతం చేసుకోనున్నాడు. వికెట్ కీపర్ కెప్టెన్‌గా పని చేసిన రెండో ఆటగాడిగా పంత్ నిలవనున్నాడు. ఈ జాబితాలో తొలి స్థానం క్రికెట్ దిగ్గజం ఎంఎస్ ధోనీదే. ధోనీ తర్వాత ఈ ఫీట్ అందుకున్న రెండో భారత కెప్టెన్, వికెట్ కీపర్‌గా పంత్ రికార్డు సృష్టించనున్నాడు.




# ‘12ఏ రైల్వే కాలనీ’

## మూవీ రివ్యూ



అల్లరి నరేశ్ .. హాస్య కథానాయకుడిగా చకచకా 50 సినిమాలకి పైగా చేసేసిన నటుడు. ఆ తరువాత విలక్షణమైన కథలను ఎంచుకుంటూ, తనలోని నటుడిని కొత్త కోణంలో ఆవిష్కరించే ప్రయత్నం చేస్తూ వెళుతున్నాడు. అలా ఆయన చేసిన సినిమానే ‘12 %ూ% రైల్వే కాలనీ’. ‘పొలిమేర’ ఫేమ్ అనిల్ విశ్వనాథ్ కథ - స్క్రీన్ ప్లే - సంభాషణలు సమకూర్చిన సినిమా ఇది. నాని కాసరగడ్డ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఈ రోజునే థియేటర్లకు వచ్చింది.

**కథ:** కార్తీక్ (అల్లరి నరేశ్) ఓ అనాథ. వరంగల్ కి చెందిన కార్తీక్ ఎక్కువగా స్నేహితులతోనే తిరుగుతూ ఉంటాడు. వాళ్ల వీధిలోకి కొత్తగా ఆరాధన (కామాక్షి భాస్కర్ల) దిగుతుంది. తన తల్లితో కలిసి ఆమె అక్కడ నివసిస్తూ ఉంటుంది. ఆరాధనను చూడగానే కార్తీక్ మనసు పారేసుకుంటాడు. ‘బ్యాడ్మింటన్’ అంటే ఆమెకి చాలా ఇష్టమనే విషయాన్ని అతను గమనిస్తాడు. ఆమె ఆశయం నెరవేరడానికి అవసరమైన 3 లక్షలను ఏర్పాటు చేయాలని అనుకుంటాడు. వరంగల్‌లో రాజకీయనాయకుడిగా ఎదగడానికి ‘టిల్లు’ (జీవన్ కుమార్) ప్రయత్నాలు చేస్తుంటాడు. ఈ సారి ఎన్నికలలో తాను తప్పకుండా గెలవాలనే పట్టుదలతో ఉంటాడు. ‘టిల్లు’తో ఉన్న పరిచయం కారణంగా 3 లక్షలు అడగడానికి కార్తీక్ అతని దగ్గరికి వెళతాడు. అతను కార్తీక్ కి ఒక పార్శిల్ ఇచ్చి, దానిని జాగ్రత్తగా దాచమని చెబుతాడు. అతనికి అవసరమైన డబ్బును తాను సర్దుబాటు చేస్తానని మాట ఇస్తాడు. దాంతో కార్తీక్ ఆ పార్శిల్ ను తీసుకుని వెళతాడు. ఆరాధన వాళ్ల ఇంటికి తరచూ షిండే (అనీశ్ కురువిల్లా) వచ్చి వెళుతుండటం కార్తీక్ చూస్తాడు. అతను ఆమె తండ్రి అయ్యుండొచ్చని అనుకుంటాడు. ఆ రోజున ఆరాధన వాళ్ల ఇంటికి తాళం వేసి ఉంటుంది. దాంతో ‘టిల్లు’ ఇచ్చిన పార్శిల్ ను ఆరాధన ఇంట్లో రహస్యంగా దాచడం మంచిదని భావిస్తాడు. ఆ రాత్రి రహస్యంగా ఆ ఇంట్లోకి వెళతాడు. అక్కడ ఏం జరుగుతుంది? ఆ సంఘటన అతని జీవితాన్ని ఎలాంటి మలుపు తిప్పుతుంది? ఆరాధనతో షిండేకిగల సంబంధం ఏమిటి?కార్తీక్ కి ‘టిల్లు’ ఇచ్చిన పార్శిల్ లో ఏముంది? అనేదే కథ.

**విశ్లేషణ:** అల్లరి నరేశ్ .. నిజంగానే తెరపై హాస్య కథానాయకుడిగా ఒక రేంజ్ లో అల్లరి చేస్తూ వెళ్లాడు. రాజేంద్రప్రసాద్ తరువాత పూర్తిస్థాయి హాస్య కథానాయకుడుగా తనదైన దూకుడు చూపించాడు. అయితే కామెడీ చేసి చేసి మొహం మొత్తేసింది అంటూ, తనకి మంచి పట్టున్న కామెడీని పక్కన పెట్టేసి, డిఫరెంట్ జోనర్స్ లో చేస్తూ వెళుతున్నాడు. ఆ ప్రయత్నంలో భాగంగా ఆయన చేసిన మరో ప్రయోగమే ఈ సినిమా.

హీరో .. ముగ్గురు క్లోజ్ ఫ్రెండ్స్ .. తాగుబోతు బ్యాచ్ గా పరిచయమవుతారు. మొదటి సీన్ లోనే హారర్ పాళ్లు కలుస్తున్నట్టుగా అనిపించడంతో, కొంపదీసి ఇది దెయ్యాల సినిమానా? అనే డౌట్ వస్తుంది. ‘ఏదో ఊరికే అలా భయపెట్టడానికి ట్రై చేశారు .. అలాంటిదేం లేదులే ..’ అనుకుంటూ రిలాక్స్ అయిన ఆడియన్స్ , ఇంటర్వెల్ బ్యాంగ్ చూసి ఇదెక్కడి గోలరా బాబు అనుకుంటూ ఉలిక్కిపడతారు. ఆ తరువాత వరంగల్ కథ .. హైదరాబాద్ మీదుగా ‘ముంబై’ కూడా వెళ్లొస్తుంది. సాధారణంగా ఏ సినిమాలోనైనా ఒక ట్విస్ట్ తో ఫస్టాఫ్ ముగుస్తుంది. ఆ ట్విస్ట్ నుంచి సెకండాఫ్ నెక్స్ట్ లెవెల్ కి వెళుతుంది. అయితే ఆ ట్విస్ట్ అక్కడ ఉంది కదా .. అప్పటివరకూ వెయిట్ చేయండి అనడం కరెక్ట్ కాదు. సెకండాఫ్ లో బోలెడు విశేషాలు ఉన్నాయంటూ, ఇంటర్వెల్ బ్యాంగ్ వరకూ ఫస్టాఫ్ ను లాగకూడదు. ఈ సినిమా విషయంలో జరిగింది అదే. ఫస్టాఫ్ నీరసంగా .. నిదానంగా సాగుతుంది. సెకండాఫ్ లో కథ పట్టాలు తప్పేసి పరిగెడుతుంది. హింసతో కూడిన హారర్ టచ్ ఇస్తుంది.

**పనితీరు:** దర్శకుడు ఎంచుకున్న లైన్ బాగానే ఉంది. నిజంగానే ఇలా జరిగిందంటూ తెరపైకి తీసుకొచ్చిన ఆధారాలు బాగానే ఉన్నాయి. అయితే అసలు విషయంలోకి వెళ్లడానికి తీసుకున్న సమయమే ఇక్కడ మైనస్. లవ్వు .. రొమాన్స్ సంగతి అలా ఉంచితే, అల్లరి నరేశ్ కి బలమున్న కామెడీ వైపు నుంచి కూడా సరైన సన్నివేశాలు డిజైన్ చేసుకోకపోవడం కూడా మరో లోపంగా అనిపిస్తుంది. అల్లరి నరేశ్ కామెడీ మాత్రమే కాదు, ఎలాంటి పాత్రలనైనా బాగా చేయగలడు. ఆ విషయాన్ని ఇంతకుముందే అతను నిరూపించుకున్నాడు. అయితే వేరే జోనర్ కథలను ఎంచుకునేప్పుడు మాత్రం, గట్టి కసరత్తు జరిగేలా చూసుకోవలసిన అవసరం ఉంది. కామాక్షి భాస్కర్ల లుక్ అంత ఆకర్షణీయంగా అనిపించలేదు. హీరో ఫ్రెండ్స్ గా ముగ్గురు కమెడియన్స్ కనిపిస్తారు. కానీ వాళ్ల పాత్రల ద్వారా ఎలాంటి ప్రయోజనం కనిపించదు. ఎమోషన్స్ ఎక్కడా కనెక్ట్ కాలేదు .. సంభాషణాలు మనసుకు పట్టుకోలేదు. ఫొటోగ్రఫీ .. ఎడిటింగ్ ఓకే. భీమ్స్ నేపథ్య సంగీతం ఫరవాలేదు.

**ముగింపు:** కథాకథనాల పరంగా దర్శకుడు ఫస్టాఫ్ ను .. సెకండాఫ్ ను బ్యాలెన్స్ చేసుకుంటే బాగుండేదేమో అనిపిస్తుంది. ఫస్టాఫ్ ను ఇంటర్వెల్ బ్యాంగ్ వరకూ సాదాసీదాగా వదిలేసి, సెకండాఫ్ లో ట్విస్టులపై ట్విస్టులు ఇవ్వడానికి ప్రయత్నించడం కనిపిస్తుంది. ఈ స్పీడ్ మీదే కథ అదుపుతప్పినట్టు అర్థమైపోతుంది.

# రీరిలీజ్‌లోనూ సత్తా చాటిన ‘బాహుబలి’



ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి రూపొందించిన అద్భుత దృశ్యకావ్యం ‘బాహుబలి’ రీరిలీజ్ లోనూ బాక్సాఫీస్ వద్ద తన సత్తా ఏమాత్రం తగ్గలేదని నిరూపించుకుంది. రెండు భాగాలను కలిపి ‘బాహుబలి: ది ఎపిక్’ పేరుతో ఇటీవల విడుదల చేయగా, ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ. 53 కోట్లు వసూలు చేసి సరికొత్త రికార్డు సృష్టించింది. రీరిలీజ్ అయిన సినిమా ఈ స్థాయిలో వసూళ్లు సాధించడం ఒక చారిత్రక విజయంగా ట్రేడ్ వర్గాలు అభివర్ణిస్తున్నాయి.

ఏరియాల వారీగా వసూళ్ల వివరాలు చూస్తే, తెలుగు రాష్ట్రాల్లోనే ఈ చిత్రం రూ. 23 కోట్లు రాబట్టింది. కర్ణాటక, తమిళనాడు, కేరళ కలిపి రూ. 9.8 కోట్లు, హిందీలో రూ. 8.45 కోట్లు కలెక్ట్ చేసింది. ఓవర్సీస్ లోనూ సత్తా చాటుతూ 12 కోట్ల రూపాయల గ్రాస్ వసూలు చేసింది.

ప్రస్తుతం థియేటర్లలో ఉన్న కొత్త సినిమాలను కూడా వెనక్కి నెట్టి ‘బాహుబలి’ ఈ స్థాయిలో వసూళ్లు సాధించడం విశేషం. రాజమౌళి దర్శకత్వ ప్రతిభ, ప్రభాస్ స్టార్‌డమ్‌కు ప్రేక్షకులు మరోసారి బ్రహ్మరథం పట్టారని ఈ వసూళ్లు రుజువు చేస్తున్నాయి. మొత్తం మీద ‘బాహుబలి’ రీరిలీజ్‌లో అత్యధిక గ్రాస్ రాబట్టిన చిత్రంగా నిలిచి, భారతీయ సినిమాలో తన స్థానం ఎప్పటికీ పదిలమని మరోసారి చాటిచెప్పింది.






Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**